నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
మంగళవారం | జనవరి 31, 2024 | www.navatelangana.com

పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ - వాంకిడి

మండలంలోని కన్నర్‌గావ్ గ్రామానికి చెందిన నికోడె మోతీరాం(55) పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ సాగర్ తెలిపిన వివరాల ప్రకారం కొంతకాలం నుండి అర్శమొలలతో బాధపడుతున్నాడు. బాధ భరించలేక గత సంవత్సరం పురుగులమందు తాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స చేయించారు. బాధతో తరచూ మద్యం తాగుతుండేవాడు. ఈ క్రమంలో సోమవారం కొడుకు పని నిమిత్తం వాంకిడికి రాగా భార్య తానుబాయి, కోడలు గురుబాయి చేను పనులకు వెళ్లారు. ఇంటిలో ఎవరూ లేని సమయంలో మోతిరాం పురుగులమందు తాగాడు. సాయంత్రం చేను పనులు ముగించుకొని భార్య, కోడలు ఇంటికి రాగా గమనించి ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. మంగళవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు.

మరుగుదొడ్ల పనులు సకాలంలో పూర్తి చేయాలి



కెరమెరి : మరుగుదొడ్ల పనులను సకాలంలో పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని ఎంపీడీవో మహేందర్ అన్నారు. మంగళవారం మండలంలోని కైరే గ్రామంలో ప్రభుత్వ పాఠశాలకు మంజూరైన మరుగుదొడ్లకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్‌లో పాఠశాలకు మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.2లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. నిర్మాణంలో తగిన నాణ్యత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎపిఓ మల్లయ్య, ఈసీ ఆఖ్యానాయక్, టెక్నికల్ అసిస్టెంట్ అరవింద్, ఫీల్డ్ అసిస్టెంట్ తులసిరాం, ఎస్ఎంసి చైర్మన్ మందాడే శివరాం, ప్రధానోపాధ్యాయులు యోగేష్, గ్రామస్తులు బుధాజీ, సోమయ్య మందాడే జలపతి, బాలాజీ పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీల అభివృద్ధికి నిధులు కేటాయించాలి

- ఎమ్మెల్యే కోవలక్ష్మి
- నూతన భవనాల ప్రారంభోత్సవం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మీ డిమాండ్ చేశారు. మండలంలోని చిలాటిగూడ, కౌటగూడ, గోవిందపూర్ గ్రామాల్లో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాలను అదనపు కలెక్టర్ దీపక్ తివారి, జడ్పిటిసి నాగేశ్వరరావు, ఎంపిపి మల్లికార్జున్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధి జరిగితేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అటువంటి గ్రామపంచాయతీలకు నిధులు కేటాయించాలన్నారు. సర్పంచుల పదవీకాలం జనవరి 31తో ముగియనున్న నేపథ్యంలో ప్రభుత్వం వారి పదవీ కాలాన్ని పెంచాలన్నారు. ప్రత్యేక అధికారుల పాలన పెడతామని చెబుతున్న ప్రభుత్వం ఇంకా అధికారుల జాబితా విడుదల చేయలేదని తెలిపారు. ఏదేమైనా పంచాయతీల అభివృద్ధి కోసం ప్రభుత్వం అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీబీన్ అహ్మద్, ఆయా గ్రామాల సర్పంచులు మహేష్, లక్ష్మీనారాయణ, గంగుబాయి, ఎంపీటీసీ గాదవేని మల్లేష్, ఎంపీడీవో శశికళ, ఎంపీఓ ప్రసాద్ పాల్గొన్నారు.

అసంతృప్తి..అప్పుల భారం..!

- నేటితో సర్పంచుల పదవీకాలం పూర్తి
- పర్సన్ ఇన్‌చార్జీలుగా కొనసాగించాలని డిమాండ్



నవతెలంగాణ-జైపూర్

గ్రామ పంచాయతీ పాలకవర్గాల గడువు నేటితో ముగియనుంది. గ్రామాల్లో వివిధ పనుల నిర్వహణతో పాటు అభివృద్ధికి లక్షల్లో అప్పులు మూటగట్టుకున్న సర్పంచులు అసంతృప్తితో పదవులను వీడనున్నారు. 2019లో సర్పంచులుగా ఎన్నిక కాగా 2024 జనవరి 31తో గడువు పూర్తవుతోంది. గడిచిన ఐదు సంవత్సరాల పదవీకాలంలో అసంతృప్తి, ఆర్థిక భారం మిగిలిందని పలువురు సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫిబ్రవరి2, 2019న పదవీ బాధ్యతలు చేపట్టిన సర్పంచులకు అక్టోబర్ 2, 2019 వరకు చెక్ పవర్ ఇవ్వలేదు. దీనికి తోడు మార్చి 2020 నుండి 2022 వరకు దాదాపుగా రెండు సంవత్సరాలు కరోనాతో గడిచిపోయింది. మిగిలిన రెండు సంవత్సరాల పదవీకాలంలో ఆర్థికంగా చితికిపోయామని పలువురు సర్పంచులు వాపోతున్నారు. నియోజకవర్గం పరిధిలో గల 102 సర్పంచులతో పాటు జిల్లా పరిధిలో గల 311 మంది సర్పంచులు దాదాపుగా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. పదవుల్లో కొనసాగిన కాలంలో దాదాపుగా రెండు సంవత్సరాల నుండి రాష్ట్ర ఆర్థిక అభివృద్ధి (ఎస్ఎఫ్‌సీ) నిధులు విడుదల కాకపోవడం ఆర్థికంగా ఇబ్బందులకు గురి కావాల్సి వచ్చిందని పేర్కొంటున్నారు. దీనికి తోడు దాదాపుగా 14 నెలల పాటు కేంద్ర ఆర్థిక అభివృద్ధి(సీఎఫ్‌సీ) నిధులు అందలేదు. అడపాదడప అంతంతమాత్రంగా విడుదలైన నిధులతో గ్రామ పంచాయతీ నిర్వహణ, పంచాయతీ పరిధిలో చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉండటం ఏటకేటా ఆర్థిక భారం పెరుగుతూ వచ్చిందని పలువురు సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదవీకాలంలో నష్టపోయిన కాలాన్ని భర్తీ చేయడం కోసం తమ పదవీకాలం పెంచాలని కోరుతూ సర్పంచులు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. కనీసం తదుపరి ఎన్నికల వరకైనా పర్సన్ ఇన్‌చార్జీలుగా అవకాశం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ క్రమంలో జిల్లా సర్పంచుల సంఘాలతో కలిసి రాష్ట్ర సర్పంచుల సంఘం ప్రత్యేకంగా సమావేశం కావడంతో పాటు గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కను కలిసి విజ్ఞప్తి చేశారు. గతంలో సర్పంచుల పదవీకాలం పూర్తి చేసుకున్న సందర్భాల్లో అప్పటి ప్రభుత్వం సర్పంచులను పర్సన్ ఇన్‌చార్జీలుగా కొనసాగించిన తీరును వారు గుర్తు చేస్తున్నారు. 1994 ఏప్రిల్ 1 నుండి 1996 మార్చి 31 వరకు పదవీకాలం పూర్తి చేసుకున్న సర్పంచులను అప్పటి ప్రభుత్వం పర్సన్ ఇన్‌చార్జీలుగా కొనసాగించింది. ఇప్పుడు కూడా తదుపరి ఎన్నికలు నిర్వహించే వరకు తమనే పర్సన్ ఇన్‌చార్జీలుగా కొనసాగించేలా నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నారు. మరో వైపు పర్సన్ ఇన్‌చార్జీలుగా ప్రభుత్వ అధికారులను నియమించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఇక చేసేదేమీలేక కనీసం పెండింగ్‌లో ఉన్న బిల్లులైనా చెల్లించాలని సర్పంచులు అభ్యర్థిస్తున్నారు.

వసతిగృహ నిర్వహణ పక్కాగా చేపట్టాలి

- డీటీడీఓ రమాదేవి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యార్థులకు నాణ్యమైన రుచికరమైన భోజనంతోపాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడడంలో నాలుగో తరగతి సిబ్బంది పాత్ర ఎంతో ఉంటుందని వసతి గృహ నిర్వాహణ పక్కాగా చేపట్టాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు రమాదేవి అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలికల ఆదర్శ క్రీడా పాఠశాలలో ఆసిఫాబాద్ ఏటిడిఓ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల కుక్, కామాటీ, పని మనుషులకు నిర్వహించిన ఒకరోజు వృత్యాంతర శిక్షణ తరగతులకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వసతి గృహ నిర్వహణలో నాలుగో తరగతి సిబ్బంది పాత్రే కీలకమన్నారు. ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న నాలుగో తరగతి సిబ్బంది పరిసరాలు, వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. వంట చేసే ముందు ఆహార వస్తువుల నాణ్యతను పరిశీలించాలన్నారు. విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రతను తరచుగా పరిశీలిస్తూ వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ సుధాకర్ నాయక్ మాట్లాడుతూ కలుషిత ఆహారం, కలుషిత నీటి వల్లనే అనేక రోగాలు సంక్రమిస్తాయని వివరించారు. అంటువ్యాధులు, పరిసరాలు, వ్యక్తిగత శుభ్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్త పట్ల ఆయన వివరించారు. అనుభవజ్ఞులైన వంట మనుషులతో డెమో ద్వారా వివిధ వంటకాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఏసిఎంఓ ఉద్ధవ్, ఏటీడీఓలు క్షేత్రయ్య, కమ్మర్ హుస్సేన్, జీసిడిఓ శకుంతల, సోషల్ వర్కర్ నాగేంద్ర, హెచ్ఈవో శ్యామ్‌లాల్, రషీద్, సూపర్వైజర్ ఉత్తం రాథోడ్, హెచ్‌డబ్ల్యూఓ శ్రీనివాస్, సాయి, అశోక్ పాల్గొన్నారు

ఏకలవ్య పౌండేషన్ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు



నవతెలంగాణ - జైనూర్

ఏకలవ్య పౌండేషన్ ఆధ్వర్యంలో 21 గ్రామాల్లో వాలీబాల్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని ఏకల్యవ పౌండేషన్ సిబ్బంది ప్రకాష్ అన్నారు. మంగళవారం లింగాపూర్ మండలంలోని కంచన్‌పెల్లి గ్రామంలో వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏకలవ్య పౌండేషన్ ఆధ్వర్యంలో పనిచేస్తున్న 21 గ్రామాలను కలుపుతూ క్రీడా పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. క్రీడలతో పాటు గిరిజనులు విద్యాపరంగా కూడా ముందుకురావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సార్‌మెడీ గంగారాం, భీంరావు, ప్రధానోపాధ్యాయుడు ఆత్రం చొక్కేరావు, సర్పంచ్ కనక జ్యోతిరాం పాల్గొన్నారు.

ఖైరిగూడలో ఏఐటీయూసీ విజయోత్సవ ర్యాలీ





నవతెలంగాణ - రెబ్బెన

ఇటీవల సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో బెల్లంపల్లి ఏరియాలో ఏఐటీయూసీ ఘన విజయం సాధించిన సందర్భంగా పిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐటీయూసీ అధ్యక్షుడు పర్మినెంట్ వేజ్‌బోర్డు సభ్యులు వాసిరెడ్డి సీతారామయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్ఐ తిరుపతి, ఉపాధ్యక్షుడు భయ్య మొగిలి, చిప్ప నర్సయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఓసీ కార్మికులు బాణసంచా పేల్చి నృత్యాలు చేస్తూ సీతారామయ్యకు ఘనంగా స్వాగతం పలికారు. ఏఐటీయూసీ పోరాటాలకు ఆకర్షితులై పలువురు కార్మికులు, మహిళా కార్మికులు సీతారామయ్య ఆధ్వర్యంలో యూనియన్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనియన్ గెలుపొందడానికి బెల్లంపల్లి ఏరియా ఖైరిగూడ ఓసీపీ కార్మికులు ఎంతగానో కృషి చేశారన్నారు. యూనియన్‌తో సంబంధం లేకుండా ప్రతి ఒక కార్మికుడికి అండగా ఉంటామని, ఏ కార్మికుడికి సమస్య వచ్చిన పరిష్కారయ్యేవరకు పోరాడుతామన్నారు. యూనియన్‌కు యూనియన్ శత్రువులు కాదని, తమ పోరాటం కంపెనీతోనేనని తెలిపారు. కార్మికులు ఐకమత్యంతో ఉండి పోరాటాలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఖైరిగూడ ఉపాధ్యక్షుడు రెహమాన్, ఆర్గనైజింగ్ కార్యదర్శి జగ్గయ్య, వేణు, కిరణ్‌బాబు, జూపాక రాజేష్, ఉయిక చంద్రశేఖర్, దివాకర్, సముద్రాల ఆనంద్, పిట్ కార్యదర్శులు అంబటి రామయ్య, అశోక్, గడ్డం రమేష్, జహంగీర్, షిఫ్ట్ ఇన్‌చార్జీలు రాజయ్య, షకిల్, అంజయ్య పాల్గొన్నారు.

ఓబీసీ సాధన సభ విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఫిబ్రవరి 3న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఓబీసీ సాధన సభను విజయవంతం చేయాలని ఆరె సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బొట్టుపెల్లి శ్రీరాం కోరారు. జిల్లా కేంద్రంలోని ఛత్రపతి శివాజీ భవనంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరె కులానికి ఓబీసీ సర్టిఫికెట్ లేకపోవడంతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఓబీసీ సర్టిఫికెట్ లేకపోవడంతో కేంద్ర ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఉద్యోగాలలో అవకాశాలు రాకుండా పోతున్నాయన్నారు. ఓబీసీ సాధన కోసం హైదరాబాద్‌లోని నాచారం రామచంద్ర నగర్‌లోని ఎస్ఆర్ గార్డెన్‌లో నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమానికి జిల్లా నుండి పెద్ద మొత్తంలో ఆరె కులస్తులు తరలివెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో ఆరె సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కోలే బిక్కజి, ప్రధాన కార్యదర్శి సప్త శ్రీనివాస్, ఇరదండి బాబా, డివిజన్ గౌరవాధ్యక్షుడు చౌదరి గోపాల్, అధ్యక్షుడు బోర్కుట్ తిరుపతి, ఉపాధ్యక్షుడు బోతుపెల్లి అన్నారావ్, ప్రధాన కార్యదర్శి నాగపూర్ మారుతి, కోశాధికారి దిలిప్, కార్యదర్శి ప్రశాంత్, ఆసిఫాబాద్ మండల అధ్యక్షుడు గేడేకార్ సంతోష్ కుమార్, రెబ్బెన అధ్యక్షుడు చౌదరి సుభాష్, ఆత్మ చైర్మన్ కురత్కర్ రమేశ్, గుండి సర్పంచ్ జబరి రవి, మోతుగూడ అధ్యక్షుడు ఇరదండి వినోద్, వాంకిడి కార్యదర్శి జబరి మహేష్, నాయకులు రాజన్న, రాజు, గోపాల్, కిషన్, మహేష్, తిరుపతి, మల్లయ్య పాల్గొన్నారు.

సర్పంచులకు సన్మానం



నవతెలంగాణ - పెంచికల్‌పేట్

మండల కేంద్రంలోని రైతువేదికలో మండల పరిషత్ ఆధ్వర్యంలో ఎంపీపీ జాజిమొగ్గ సుజాత, జెడ్పీటీసీ సరిత మండలంలోని 12 గ్రామాల సర్పంచ్‌లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధికి ఈ ఐదు సంవత్సరాల కాలంలో సర్పంచులు ఎంతో కృషి చేశారని, గ్రామ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ముందుకు సాగారన్నారు. గ్రామాల అబివృద్ధిలో సర్పంచులే కీలకమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంగాసింగ్, ఎంపీటీసీ దూగుంట రాజన్న, మండల కోఆప్షన్ సభ్యుడు సాజిద్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

16న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి



నవతెలంగాణ-నిర్మల్

ఐసిడిఎస్‌కు బడ్జెట్ పెంచాలని, ఉద్యోగులను పర్మినెంట్ చేయాలనే డిమాండ్‌తో ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాపిత కార్మిక సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని సిఐటియు పట్టణ నాయకులు డి.పోశెట్టి అన్నారు. తెలంగాణ అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ నిర్మల్ సెక్టార్ సర్వసభ్య సమావేశం మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర బిజెపి కార్పొరేట్, మతతత్వ విధానాలను ధిక్కరిస్తూ ప్రతిఘటనకు పూనుకోవాలని, కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలపై ఛార్జిషీట్ ప్రకటిస్తూ లక్షలాది కుటుంబాల ఇంటింటికెళ్లి క్యాంపెయిన్ చేయాలని పేర్కొన్నారు. ఫిబ్రవరి 16న కార్మిక సమ్మె - గ్రామీణ భారత్ బంద్‌ను ఐఎన్టియుసి, ఏఐటియుసి, సిఐటియు, హెచ్ఎంఎస్, ఐఎఫ్ఎయులు, బిఆర్ఎయు, టిఎన్‌టియుసి, ఏఐటియుసితో పాటు ఉద్యోగ సంఘాలు, ఫెడరేషన్లు, స్కీమ్ వర్కర్ల ఫెడరేషన్లు, సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్ఎం) పిలుపునిచ్చాయన్నారు. సమ్మెలోఅంగన్వాడీ సంఘం కూడా పాల్గొంటుందని తెలిపారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 సంవత్సరాలు పూర్తయిందని, ఈ కాలంలో అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలు పర్మినెంట్, కనీస వేతనం, పిఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ చెల్లింపు తదితర ఏ ఒక్క సమస్య కేంద్ర ప్రభుత్వం పరిష్కరించలేదన్నారు. పైగా ఐసిడిఎస్‌కు బడ్జెట్ తగ్గించి నిర్వీర్యం చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకురాలు రాజమణి, శైలజ, తులసి, అరుణ, శశికళ పాల్గొన్నారు.

'చేసిన అభివృద్ధే గుర్తింపునిస్తుంది'



కౌటాల: పదవులు శాశ్వతం కాదని, చేసిన అభివృద్ధే గుర్తింపునిస్తుందని ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో మండల ప్రజా పరిషత్ ఆధ్వర్యంలో మండలంలోని సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లకు ఏర్పాటుచేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2019లో ఎన్నికైన ప్రజా ప్రతినిధులు ఎంతో అదృష్టవంతులన్నారు. రెండు సంవత్సరాలు కరోనా వల్ల అభివృద్ధి జరగకపోయినా తర్వాత గ్రామాల అభివృద్ధి శరవేగంగా జరిగిందన్నారు. గ్రామాల్లో జరిగిన అభివృద్ధి వల్లే మండలానికి ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. దీనికి మండలంలోని సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులే కారణమన్నారు. గ్రామాల్లో సర్పంచులు చేసిన అభివృద్ధి, సేవా కార్యక్రమాలను ప్రజలు గుర్తు పెట్టుకుంటారని తెలిపారు. సర్పంచ్ పదవి కాలం అయిపోగానే ప్రజలకు చేసే సేవా కార్యక్రమాలను ఆపకూడదన్నారు. అనంతరం మండలంలోని 20 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లను శాలువాలు కప్పి మెమోంటోలతో సన్మానించారు. ఇటీవల గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఉత్తమ పీఇఓగా అవార్డు అందుకున్న ఘన్‌శ్యాంను శాలువాలు కప్పి మెమోంటోతో సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అనూష, ఎంపీడీఓ అబ్దుల్ నస్రుల్లాఖాన్, ఏపీఓ పూర్ణిమ, ఎంఏఓ రాజేష్, ఏపీఎం వెంకటరమణ, ఎంఈఓ సోమయ్య, ఎంపీటీసీలు బొమ్మకంటి మనీష్, వసంత్‌రావు, బసార్కర్ శిరీష, వనిత, కోఆప్షన్ సభ్యుడు అజ్మత్ అలీ, మాజీ ఎంపీపీ గంగారాం, మాజీ కోఆప్షన్ మెంబర్ నయీం అహ్మద్, మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

జిల్లా యూత్ అండ్ స్పోర్ట్స్ కమిటీ మెంబర్ల నియామకం

నవతెలంగాణ-రెబ్బెన

మండల కేంద్రానికి చెందిన బీజేపీ నాయకులు ఇగురపు సంజీవ్, చేకూరి నవీన్‌గౌడ్‌ను జిల్లా యూత్ అండ్ స్పోర్ట్స్ అడ్వైజరీ కమిటీ మెంబర్లుగా నియమిస్తూ కేంద్ర యూత్ అండ్ స్పోర్ట్స్ శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్, కార్యాలయ డైరెక్టర్ ఆఫ్ జనరల్ నితీష్‌కుమార్ మిశ్రా లెటర్ ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమపై నమ్మకంతో ఈ కమిటీలో చోటు కల్పించిన కేంద్ర మంత్రికి, ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు, ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబుకు, బీజేపి జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్‌కు, బీజేపీ యూత్ జిల్లా యూత్ అధ్యక్షుడు సుచిత్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఇచ్చిన అవకాశాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తూ యూత్‌లో క్రీడా శక్తిని, యూత్‌కున్న అవకాశాలను ఉపయోగించుకునేలా ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి సమర్థవంతంగా నిర్వహిస్తామని వారు తెలిపారు.

పేదింటి బిడ్డలకు సర్కారీ కొలువులు











నవతెలంగాణ-కెరమెరి

కెరమెరి, ఆసిఫాబాద్ మండలాలకు చెందిన ఐదుగురు పేదింటి యువతులు సర్కారీ కొలువులు సాధించారు. కెరమెరికి చెందిన వాడై గణపతి-కమలబాయి దంపతుల కూతురు శకుంతల, డౌలే రత్నకుమార్-అనిత కూతురు డౌలే అంగోలి మండల కేంద్రంలోని నవోదయ విద్యాలయంలో పదో తరగతి పూర్తి చేశారు. ఇంటర్ తర్వాత బిఎస్సి నర్సింగ్ పూర్తి చేయగా, ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన నర్సింగ్ ఆఫీసర్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చి స్టాఫ్‌నర్స్ ఉద్యోగానికి ఎంపికయ్యారు.

ఆసుపత్రిలో పని చేస్తున్న ముగ్గురు ఎంపిక

ఆసిఫాబాద్ మండలం గుండి గ్రామానికి చెందిన రాంటెంకి తిరుపతి-యశోద దంపతుల కూతురు మీనా, ఆసిఫాబాద్‌కు చెందిన నాగుల శ్రీనివాస్-సుప్రజ దంపతుల కూతురు ప్రణయ పల్లవి, జన్కాపూర్‌కు చెందిన కాటారపు రామారావు-చంగామ్మ దంపతుల కూతురు త్రివేణి ఏడాదిగా మండలంలోని సబ్ సెంటర్లలో కాంట్రాక్టు పద్ధతిలో ఎంఎల్‌హెచ్‌పిగా సేవలు అందిస్తున్నారు. మీనా సాంగ్వి గ్రామ సబ్ సెంటర్లో, త్రివేణి సుర్దపూర్, ప్రణయ పల్లవి బారేమోడీ సబ్ సెంటర్లో సేవలందిస్తున్నారు. భూపాల్‌పల్లికి చెందిన శ్రీధర్ సైతం కెరమెరి ప్రభుత్వ ఆసుపత్రిలో కాంట్రాక్టు పద్ధతిలో మేల్ నర్స్‌గా విధులు నిర్వహిస్తున్నారు. నర్సింగ్ ఆఫీసర్‌గా ఉద్యోగం సాధించడంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఉద్యోగ నియామక పత్రాలు అందుకోనున్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

నవతెలంగాణ-ముథోల్

ప్రతి ఒక్కరూ వ్యాపార కేంద్రాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ముథోల్ ఎస్సై సాయికిరణ్ అన్నారు. మంగళవారం మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామ సమీపంలోని అంజని పుత్ర రైస్ మిల్లు ఆధ్వర్యంలో రైస్ మిల్లు వద్ద, రోడ్డు ప్రక్కన బిగించిన సీసీ కెమెరాలను ప్రారంబించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు. ప్రతి గ్రామంలో, వ్యాపార కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే నేరా నియంత్రణకు ఉపయోగపడతాయని తెలిపారు. గ్రామాల్లో గ్రామస్తుల సాయంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్ యాజమాని నరేందర్ రాథోడ్, ఉపసర్పంచ్ ఉదయ్ కుమార్, నాయకులు సాయంరెడ్డి పాల్గొన్నారు.



క్రీడాకారులకు సామాగ్రి అందజేత

నవతెలంగాణ-ఉట్నూర్

మండల కేంద్రంలోని లక్కారం గ్రామంలో జైజవాన్ జైకిసాన్ యూత్ సభ్యులకు హనుమాన్ రైస్ డిపో యాజమాని జాదవ్ రవి మంగళవారం క్రీడాకారులకు సామాగ్రి క్రికెట్ బ్యాట్, బాల్, షటిల్, వాలీబాల్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడలతో మానసికోల్లాసంతో పాటు శారీరక దారుఢ్యం పెంపొందుతుందని అన్నారు. క్రీడాకారులకు నావంతు సాయం ఎప్పుడు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు పాల్గొన్నారు.



అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

• ఆదిలాబాద్ ఎస్పీ గౌస్ ఆలం



మాట్లాడుతున్న ఆదిలాబాద్ ఎస్పీ గౌస్ ఆలం, పాల్గొన్న కార్యాలయ సిబ్బంది

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని జిల్లా ఎస్పీ గౌస్ఆలం అన్నారు. మంగళవారం మహాత్మగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక పోలీసు ముఖ్య కార్యాలయంలో రెండు నిమిషాల పాటు అధికారులు, సిబ్బంది కలిసి మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. అదేవిధంగా గాంధీజీ వర్ధంతి సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. ప్రతి ఏడాది జనవరి 30న భారతదేశమంతా ఈ కార్యక్రమాన్ని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని పేర్కొన్నారు. దేశ భద్రత, ప్రజల రక్షణ కోసం పోలీసులు తమ ప్రాణాలను సైతం తృణప్రాయంగా అర్పిస్తూ ఉంటారని కొనియాడారు. అమర వీరులను స్మరించుకోవడం దేశపౌరుల బాధ్యతగా భావించాలని అన్నారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ పోతారం శ్రీనివాస్, కార్యాలయం ఏఓ భక్త ప్రహ్లద్, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్లు నవీన్, మురళి, సూపరింటెండెంట్లు సంజీవ్, గంగాధర్, సీసీ దుర్గం శ్రీనివాస్, ఫింగర్ ప్రింట్ నిపుణులు శ్రీనివాస్, సెక్షన్ అధికారులు, టి.మురళి మోహన్, పోలీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, కార్యదర్శి గిన్నెల సత్యనారాయణ, ఐటీ కోర్ నిపుణులు సంజీవ్, ఎంఏ రియాజ్, డీసీఆర్బీ ఎస్సై ఎంఏ హకీం, హెడ్ కానిస్టేబుల్ అతావుల్లాఖాన్, మహిళా సిబ్బంది పాల్గొన్నారు.

నిర్మల్ : దేశ స్వాతంత్ర్యం కోసం అసువులు బాసిన అమరుల త్యాగం వెలకట్టలేనిదని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల అన్నారు. దేశ స్వతంత్ర పోరాటంలో ప్రాణాలర్పించిన మహనీయుల త్యాగాలను స్మరిస్తూ గాంధీజీ వర్ధంతి సందర్భంగా మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలో రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి భారతీయుడి హృదయంలో స్వదేశీ, స్వభాష, స్వరాజ్ అనే స్ఫూర్తిని గాంధీ నింపారని, ఆయన ఆలోచనలు ప్రతి భారతీయుడిలో స్ఫూర్తిని నింపుతాయని అన్నారు. దేశం కోసం, దేశ ప్రజలకు స్వేచ్ఛ స్వాతంత్ర్యం కల్పించడం లక్ష్యంగా వేలాది మంది స్వాతంత్ర్య పోరాటంలో పాలుపంచుకొని తమ ప్రాణాలను సైతం అర్పించారని అన్నారు. అలాంటి త్యాగధనులను స్మరించుకోవడం దేశ పౌరులుగా మనందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో డీసీఆర్బీ డీఎస్పీ రవీందర్‌రెడ్డి, డీపీఓ సూపరింటెండెంట్ శ్రీనివాస్, నర్సమ్మ, ఆర్ఐ రాంనిరంజన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కడెం : జాతిపిత మహాత్మ గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం మండల కేంద్రంలోని గాంధీ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే రేఖ నాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు తుమ్మల మల్లేష్ యాదవ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మండల అధ్యక్షులు మాట్లాడారు.

ప్రతి భారతీయుడి హృదయంలో స్వదేశీ, స్వభాష, స్వరాజ్ అనే స్ఫూర్తిని గాంధీ నింపారని అన్నారు. ఆయన ఆలోచనలు ప్రతి భారతీయుడిలో స్ఫూర్తిని నింపుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సతీష్‌రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు రమేష్, రఫిక్, బబ్లూ, భూషణ్, ధర్మయ్య, సత్యం చారి, గంగన్న, గౌస్, ఇస్రు పటేల్, చాంద్ పాషా, రాజేష్, రమేష్, రహీం పాల్గొన్నారు.



మౌనం పాటిస్తున్న నిర్మల్ ఎస్పీ, పోలీసులు, పోలీసు కార్యాలయ సిబ్బంది

స్టాఫ్‌నర్స్ ఉద్యోగం సాధించిన అక్కాచెల్లెలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సాధారణంగా ఇంట్లో ఒకరికి ఉద్యోగం వస్తేనే గ్రేట్ అనుకుంటారు. అలాంటిది ఇంట్లో ఇద్దరికి ఒకేసారి ఉద్యోగం వస్తే ఆ కుటుంబ సభ్యుల ఆనందం వెలకట్టలేనిది. అలాంటి సంఘటనే ఆదిలాబాద్ జిల్లాలో జరిగింది. పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన ఆవుల నీల విద్యశాఖలో ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈమెకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కాగా ఇటీవల విడుదలైన స్టాఫ్‌నర్స్ ఫలితాల్లో ఇద్దరు కుమార్తెలు శారద, స్వప్న (అక్క, చెల్లెలు) ఉద్యోగం సాధించారు. వీరిని కుటుంబ సభ్యులతో పాటు పలువురు అభినందనలు తెలిపారు.

ముథోల్‌లో పోలీసుల కవాతు



నవతెలంగాణ-ముథోల్

నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌లో శాంతిభద్రతలో భాగంగా మంగళవారం సాయంత్రం సీఐ మల్లేష్ ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు, స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి, బస్టాండ్ మీదుగా ఆయా గల్లీలో కవాతు కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఎస్సై సాయికిరణ్, మోహన్‌రావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నర్సారెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన విజయ డెయిరీ మాజీ చైర్మెన్



నవతెలంగాణ-తలమడుగు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షుడు మాజీ మంత్రి పొద్దుటూరి నర్సారెడ్డి కుటుంబాన్ని మంగళవారం రాష్ట్ర మాజీ విజయ డెయిరీ చైర్మెన్ లోక భూమారెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో స్వర్గీయ నర్సారెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. నర్సారెడ్డి కుమారులైన మధుసూదన్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, సంజీవరెడ్డిలను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

బోథ్ వాసికి రాష్ట్ర స్థాయి డా.ఏపీజే అబ్దుల్ కలాం అవార్డు



నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రానికి చెందిన విద్య ఉద్యోగ మార్గదర్శకుడు సామాజిక సేవకుడు కౌటిక శ్రీనివాస్‌కు మా అమ్మ నాన్న ఫౌండేషన్ తరపునా రాష్ట్ర స్థాయి డా.ఏపీజే అబ్దుల్ కలాం అవార్డుకు ఎంపిక చేశారు. అలాగే సామాజిక సేవలో చురుగ్గా పాల్గొంటూ, నిర్మల్ జిల్లా ప్రధాన ఆస్పత్రి ఆరోగ్యశ్రీలో సైతం ఎన్నో ఉత్తమ అవార్డులు అందుకున్న కౌటిక శ్రీనివాస్‌కి మంగళవారం లోకేశ్వరం మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర గార్డెన్‌లో మా అమ్మ నాన్న ఫౌండేషన్ చైర్మెన్ ఎం. ఆంజనేయులు 13వ వార్షికోత్సవం సందర్భంగా అవార్డు మెమోంటోను అందజేశారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

బోథ్‌లో సీసీఐ పత్తి కొనుగోళ్లు నిలిపివేత

నవతెలంగాణ-బోథ్

బోథ్ మార్కెట్ యార్డు పరిధిలోని బోథ్, సొనాల, నేరడిగొండ, పొచ్చెర, జిన్నింగ్‌లోని సీసీఐ పత్తి కొనుగోలు బంద్ చేస్తున్నట్టు మార్కెట్ సెక్రటరీ ఎన్.మనోహర్ తెలిపారు. అలాగే బోథ్ మార్కెట్ పరిధిలోని అన్ని జిన్నింగ్‌లలో ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 5 వరకు కొనుగోళ్ల నిలిపివేస్తున్నట్లు తెలిపారు. రైతులు గమనించి సహకరించాలని కోరారు.

బోథ్ స్పెషల్ గ్రేడ్ మార్కెట్ సెక్రటరీగా మనోహర్



నవతెలంగాణ-బోథ్

బోథ్ మార్కెట్ యార్డ్ స్పెషల్ గ్రేడ్ మార్కెట్ సెక్రటరీగా ఎస్.మనోహర్ మంగళవారం ఉద్యోగబాధ్యతలు చేపట్టారు. ఇదివరకు మార్కెట్ సెక్రటరీగా విధులు నిర్వహించిన దేవయ్య ఆదిలాబాద్‌కు బదిలీ కావడంతో అలాగే కరీంనగర్ జిల్లా మానకొండూరు మార్కెట్ నుంచి బోథ్ మార్కెట్ యార్డ్‌కు బదిలీపై రావడం జరిగింది. దీంతో బోథ్ మార్కెట్ స్పెషల్ గ్రేట్ సెక్రటరీగా ఉద్యోగబాధ్యతలు చేపట్టారు. అలాగే నూతనంగా బాధ్యతలు చేపట్టిన మార్కెట్ సెక్రటరీకి మార్కెట్ కమిటీ చైర్మన్ సోలంకి రుక్మన్ సింగ్ సన్మానించారు. కార్యక్రమం అధికారులు దేవయ్య, స్వామి పాల్గొన్నారు.


బాధితుడికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-జైనథ్

మండల కేంద్రంలో ఇటీవల బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న గొల్ల పవన్‌కి మంగళవారం ఉదయం మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న తన వంతుగా రూ.50వేలు ఆర్థిక సాయం అందజేసి, తన ఉదారతను చాటుకున్నారు. బాధిత కుటుంబానికి ఎల్లవేళల అండగా ఉంటానని భరోసాని ఇచ్చారు. బాధితుడి స్నేహితులు మాజీ ఎమ్మెల్యే జోగు రామన్నకి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట గ్రామ సర్పంచ్ దుమాల దేవన్న, నాయకులు లింగారెడ్డి, వెంకట్‌రెడ్డి, జక్కుల అడెల్లు, నూకల లస్మన్న, దేవుళ్ల సంజీవ్, పులివేని గణేష్ ఉన్నారు.

ఉత్తమ ఫీల్డ్ అసిస్టెంట్‌కు సన్మానం



నవతెలంగాణ-కడెం

జనవరి 26న నిర్మల్ జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ చేతుల మీదుగా నచ్చన్‌ఎల్లాపూర్ గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ కమలాకర్ ఉత్తమ ఫీల్డ్ అసిస్టెంట్ అవార్డు అందుకున్న సందర్భంగా మంగళవారం నచ్చన్‌ఎల్లాపూర్ సర్పంచ్ బొడ్డు గంగన్న ఆధ్వర్యంలో ఫీల్డ్ అసిస్టెంట్ కమలాకర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రమాదేవి, పెత్తర్పు హెచ్ఎం భీమలింగం, నచ్చన్‌ఎల్లాపూర్ హెచ్ఎం ప్రతాప్ సింగ్, అంగన్వాడీ టీచర్ లక్ష్మి, కారోబారి మహేందర్, వెంకటేష్ గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళలు సరైన పౌష్టికాహారాన్ని తీసుకోవాలి



నవతెలంగాణ-లక్ష్మణచాంద

మహిళలు సరైన పౌష్టికాహారాన్ని తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యులు శ్రీమంత్ అన్నారు. మంగళవారం మండలంలోని ధర్మారంలో ఎనీమియా సే నిర్మల్ ముక్త్ మిషన్ శక్తి ఆధ్వర్యంలో మహిళలకు రక్తహీనతపై అవగాహన కల్పించారు. గర్భిణీ స్త్రీలు, మహిళలు సరైన పౌష్టికాహారం తీసుకోవాలని అన్నారు. ఐరన్ మొతాదు ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజేందర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీలత, ఐసీడీఎస్ సీడీపీఓ నాగమణి, సూపర్‌వైజర్ భాగ్యవతి, మిషన్ శక్తి కోఆర్డినేటర్ సవిత, బృంద సభ్యులు శైలజ, మౌనిక, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అందరి సహకారంతో గ్రామాల అభివృద్ధి



సర్పంచ్‌లను సన్మానించిన భీంపూర్ ఎంపీపీ రత్నప్రభ

నవతెలంగాణ-తాంసి

అన్ని శాఖల అధికారుల సహకారంతోని గ్రామాలు అభివృద్ధి చెందాయని ఎంపీపీ రత్నప్రభ అన్నారు. మంగళవారం భీంపూర్ మండల సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ అధ్యక్షత వహించి, ఎజెండాను చదివి వినిపించి సమావేశాన్ని ప్రారంభించారు. వ్యవసాయ శాఖ అధికారి రవీందర్ తమ శాఖ ప్రగతి నివేధికను చదివి వినిపించారు. వర్షాకాలంలో వేస్తున్న పంటల నమోదు కార్యక్రమం కొనసాగుతుందని పంటలు వేసుకుంటున్నా రైతులు తప్పకుండా ఏఈఓ దగ్గర నమోదు చేసుకోవాలన్నారు. రుణమాఫీ ఎప్పుడు పడుతుందని ఎంపీటీసీలు, సర్పంచులు ఏఓని అడుగగా మాకు ఖచ్చితమైన సమాచారం లేదన్నారు. వైద్యాధికారి నిఖిల్ రాజ్ వివరిస్తూ చలి తీవ్రత అధికంగా ఉండటంతో వృద్ధులు చిన్నపిల్లలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, గర్భిణి స్త్రీలకు అన్ని రకాల వైద్య పరీక్షలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఫిబ్రవరి 14వ తేదీ వరకు లెప్రసీ వ్యాధిగ్రస్తులను గుర్తించడానికి ప్రతి గ్రామంలో వైద్య శిబిరాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం ఆయా శాఖలకు సంబంధించిన అధికారులు ప్రగతి నివేధికను చదివి వినిపించారు. సర్పంచుల పదవీకాలం ఈ నెలతో ముగియడంతో సర్పంచ్‌లను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లస్మన్న, ఎంపీడీఓ శ్రీనివాస్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ హరిదాస్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

16న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

నవతెలంగాణ-నిర్మల్

ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా జరిగే కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్‌బంద్ జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. మంగళవారం డీఈఓ కార్యాలయంలో డీఈఓ రవీందర్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతు, వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలకు నిరసనగా జాయింట్ ప్లాట్ ఫాం ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ (ఐఎన్టీయూసీ, ఏఐటీయూసీ, సీఐటీయూ, హెచ్ఎంఎస్,) ఇతర సంఘాలు, వివిధ రంగాల ఉద్యోగ సంఘాలు, అఖిల భారత ఫెడరేషన్లు, సంయుక్త కిసాన్ మోర్చా, రైతు-వ్యవసాయ కార్మిక సంఘాల ఐక్యవేదిక బంద్‌కు పిలుపునిచ్చాయన్నారు. ఫిబ్రవరి 16న అఖిల భారత స్థాయిలో కార్మికుల సమ్మెతో పాటు గ్రామీణ భారత్‌బంద్ పాటించాలని నిర్ణయించాయని అన్నారు. తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉద్యోగ, సంఘాలకు అనుబంధ యూనియన్‌గా ఉన్న మేము మధ్యాహ్న భోజన పథకం రంగానికి బడ్జెట్ పెంచాలని అన్నారు. కనీస వేతనం రూ.26వేలు, ఇవ్వాలని అన్నారు. ఈ జాతీయ సమ్మెతో పాటు గ్రామీణ బంద్‌లో భాగస్వాములమౌతున్నామని తెలిపారు. పారిశ్రామిక వివాదాల చట్టం 1947 సెక్షన్-22, సబ్ సెక్షన్ (1) అనుసరించి ఈ సమ్మె నోటీస్ ఇస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.రాధా, జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మి, నాయకులు బుచ్చవ్వ ఆసియాబాన్, కార్మికులు పాల్గొన్నారు.



డీఈఓ రవీందర్‌రెడ్డికి సమ్మె నోటీసును అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

సమస్యలు పరిష్కరించాలని అంబేద్కర్ విగ్రహానికి వినతి



నవతెలంగాణ-ఉట్నూర్

వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి పాలకులు చిత్తశుద్ధితో కృషి చేయాలని, సాగు, తాగునీరు, యూనివర్సిటీ, రైల్వేలైన్ సాధన కమిటీ ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ భరత్‌చౌహన్ అన్నారు. మంగళవారం బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేసి, ప్రాంతీయ వివక్షతను పారదోలాలని అన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో వెనుకబడిన ఏజెన్సీ ఉట్నూరు ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని అన్నారు. పాలకులకు కనువిప్పు అయ్యే విధంగా చూడాలని, వినతిపత్రాన్ని అందజేశారు. ఆదిలాబాద్ నుంచి కేస్లాపూర్, ఇంద్రవెల్లి, ఉట్నూర్, జైనూర్, జోడేఘాట్, ఆసిఫాబాద్ మీదుగా కాగజ్ నగర్ వరకు రైల్వేలైను ఏర్పాటు చేయాలని, ఉట్నూర్ ఏజెన్సీ ప్రాంతంలో సెంట్రల్ యూనివర్సిటీ స్థాయిలో అగ్రికల్చర్ యూనివర్సిటీ, డెంటల్ యూనివర్సిటీ, మెడికల్ కాలేజీ, వెటర్నరీ కాలేజీ లను మంజూరు చేయాలనీ కోరారు. ఏజెన్సీ ప్రాంతంలో తాగునీరు, సాగునీరు కోసం శాశ్వత పరిష్కారం చూపెట్టాలన్నారు. వీటి సాధన కోసం దశలవారీగా కార్యక్రమాలు చేపడుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోకన్వీనర్లు బానోత్ రామారావు, కట్టా లక్ష్మణాచారి, జాదవ్ రామకృష్ణ నాయక్, మాజీ సర్పంచ్ ఉట్నూర్ బొంత ఆశారెడ్డి, మసూద్ అలీ, ఠాకూర్ వీర్‌సింగ్, రాథోడ్ శేషరావు, నాందేవ్, దారాసింగ్, భుజంగరావు, లక్ష్మణ్, రామన్న పాల్గొన్నారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు అన్నారు. మంగళవారం మండలంలోని ఎల్లూరు గ్రామ పంచాయతీ పరిధిలో గల మేరగూడ గ్రామంలో పోలీసులు మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఎనిమిది నిరుపేద కుటుంబాలకు 25 కిలోల బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఉన్నత చదువులు చదివి గ్రామానికి మంచిపేరు తీసుకురావాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. గ్రామాల్లోకి ఎవరైన కొత్త వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్సై కొమురయ్య పాల్గొన్నారు.

జంతువుల పట్ల ప్రేమ చూపాలి

● అదనపు కలెక్టర్ దీపక్ తివారి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జంతువుల పట్ల సరైన వైఖరి కలిగి ఉండి ప్రేమ చూపాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. పశుసంవర్ధక శాఖలో నిర్వహిస్తున్న జంతు సంక్షేమ పక్షోత్సవాల కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సురేష్ కుమార్‌తో కలిసి పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్య జీవితంలో కనిపించే వివిధ రకాల జంతువుల పట్ల సరైన వైఖరి కలిగి ఉండాలన్నారు. గ్రామాల్లో కుక్కలు కరిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. వీధి జంతువులకు అవసరమైన ఆహారం అందించాలని సూచించారు. వాతావరణ సమతుల్యతకు గ్రామాల్లో తిరిగి వివిధ రకాల జంతువులు ఉపయోగపడతాయన్నారు. అనంతరం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు సుభాష్, భరత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పశు వైద్య అధికారి డాక్టర్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

● అదనపు కలెక్టర్ దీపక్ తివారి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

10వ తరగతి వార్షిక పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించే దిశగా కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి ఉపాధ్యాయులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ తరగతి వార్షిక పరీక్షలలో మెరుగైన ఫలితాలు సాధించే దిశగా కృషి చేయాలని అన్నారు. సబ్జెక్టుల వారిగా ఉపాధ్యాయులు కార్యచరణ ప్రకారంగా విద్యార్థులను సన్నద్ధం చేయాలని, విద్యార్థులు అందరూ 10 జీపీఏ సాధించేలా కృషి చేయాలని తెలిపారు. విద్యార్థుల ప్రగతి ఆధారంగా తక్కువ ఉన్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి పరీక్షలకు సంబంధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉప కేంద్రాలు ప్రారంభం



నవతెలంగాణ-చింతలమానేపల్లి

జాతీయ ఆరోగ్య మిషన్ కింద రూ.20 లక్షల అంచనాతో నిర్మించిన ఆరోగ్య ఉప కేంద్రాలను మంగళవారం ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు ప్రారంభించారు. మండల కేంద్రము తో పాటు కర్జెల్లి, రవింద్రనగర్-2 గ్రామాలలో నిర్మించిన కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఈ కేంద్రాలను విరివిగా ఉపయోగించుకోవాలని, కేంద్ర ప్రభుత్వం తరపున డాక్టర్లు, వైద్య సిబ్బందిని నియమిస్తామని హామీ ఇచ్చారు. వీటి ద్వారా ఉచిత వైద్య పరీక్షలు, మందులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ ఇన్‌ఛార్జి చైర్మన్ కోనేరు కృష్ణ, డీఈ నర్సింహరావు, సందీప్‌రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సీతారాం, డా.గణేష్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ధోనీ శ్రీశైలం, ఎంపీపీ డుబ్బుల నానయ్య, జెడ్పీటీసీ డుబ్బుల శ్రీదేవి, మాజీ జెడ్పీటీసీ ఎల్ములే మల్లయ్య, మండల అధ్యక్షుడు తిరుపతి గౌడ్, సర్పంచులు చౌదరి నానయ్య, సుశీల్ మండల్, ఎంపీటీసీ చౌదరి రంగన్న, చప్లే సుధాకర్ పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లు తాత్కాలికంగా నిలిపివేత

నవతెలంగాణ-జైనూర్

మండలంలోని రెండు జిన్నింగు మిల్లులలో సీసీఐ ద్వారా కొనుగోలు చేస్తున్న పత్తి కొనుగోళ్లు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి ఇర్ఫాన్‌ఖాన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండు జిన్నింగు మిల్లులలో పత్తి కుప్పలు, పత్తి గీజాలు ఎక్కువగా ఉన్నందున స్థలం లేకపోవడంతో వచ్చే నెల ఒకటో తేదీ నుంచి ప్రారంభిస్తామని తెలిపారు. త్వరలోనే పత్తి కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. రైతులు ఎవరు కూడా పత్తిని సీసీఐ కేంద్రానికి తీసుకురావొద్దని తెలిపారు. దీనికి రైతులు సహకరించాలని పిలుపునిచ్చారు.

పత్తి కొనుగోలు నిలిపివేత పుకార్లు నమ్మొద్దు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పత్తి కొనుగోలు నిలిపివేతపై సామాజిక మాధ్యమాలలో వస్తున్న పుకార్లను నమ్మవద్దని జిల్లా మార్కెటింగ్ అధికారి గజానంద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత కొద్ది రోజులుగా రైతులు పెద్ద మొత్తంలో పత్తి మిల్లులకు తీసుకువస్తున్నారని దీనితో అక్కడ స్టాక్ పెరిగిందని, దీనితో మూడు నుంచి నాలుగు రోజుల పాటు తాత్కాలికంగా పత్తి కొనుగోలు నిలిపివేసే అవకాశం ఉంటుందని అంతేకానీ 31వ తేది వరకు మాత్రమే సీసీఐ ఆధ్వర్యంలో కొనుగోలు జరుగుతుందని వస్తున్న వార్తలు నిజం లేదని రైతులు దీని పట్ల ఆందోళన చెందకూడదని పేర్కొన్నారు. పత్తి కొనుగోలు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని పేర్కొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన

నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు శివకేశవనగర్‌లోని మండల ప్రజా పరిషత్ పాఠశాల విద్యార్థులకు మంగళవారం కుష్టు వ్యాధి నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఈ నెల 30వ తేదీ నుండి వచ్చే నెల 13 వరకు ఇంటింటికి తిరుగుతూ కుష్టు వ్యాధిపై అవగాహన కల్పిస్తామని డాక్టర్ వినయ్ ఉప్రె తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఈఓ రవిదాస్, ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్, అధ్యాపకులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత చెడ్వాయి

నవతలంగాణ-పెంచికలపేట్

మండలంలోని కొండపెల్లి గ్రామంలో కొండపల్లి యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంటులో చెడ్వాయి జట్టు గెలుపొందింది. గెలుపొందిన జట్టుకు మొదటి బహుమతి రూ.20 వేలు, రన్నరఫ్ జట్టుకు రూ.10 వేల నగదు బహుమతులను గ్రామ సర్పంచ్ సంజీవ్, మాజీ సర్పంచ్ సుధాకర్, గ్రామస్తులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓటమే గెలుపుకు నాందన్నారు.



రోడ్డు భద్రత నియమాలు తప్పక పాటించాలి

● ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్

నవతెలంగాణ-ఆసిఫాబాద్



రోడ్డు భద్రత నియమాలు ప్రతి ఒక్కరు తప్పక పాటించాలని ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్ అన్నారు. మంగళవారం జిల్లాలోని జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో డీటీసీ గంధం లక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన 37వ జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల కార్యక్రమంలో ఎస్పీ సురేష్ కుమార్‌తో కలిసి జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల పోస్టర్లను, "డాడీ సీ రోడ్" యాప్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రతా నిబంధనలు పాటించడం ద్వారా సురక్షితమైన ప్రయాణం చేయవచ్చని, ప్రమాదాలకు గురయ్యే అవకాశం తక్కువగా ఉంటుందని తెలిపారు. రోడ్డు ప్రమాదం వల్ల ఒక కుటుంబం రోడ్డున పడే అవకాశం ఉంటుందని అన్నారు. వాహనం నడిపేటప్పుడు అతివేగం ప్రమాదకరమని నిబంధనలు పాటించాలన్నారు. జిల్లా రవాణాశాఖ అధికారి గంధం లక్ష్మి మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ నుండి ఫిబ్రవరి 14వ తేదీ వరకు జిల్లాలో రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని, తద్వారా ప్రజలకు రోడ్డు భద్రతా నిబంధనలపై ప్రత్యేక కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అనేక ప్రమాదాల నుండి రక్షిస్తుందని తెలిపారు. కారు నడిపే వారు, కారులో ప్రయాణించే వారు తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలని, మొబైల్ మాట్లాడుతూ వాహనం నడుపరాదని, మద్యం సేవించి వాహనం నడుపరాదని తెలిపారు. ప్రయాణికులను గమ్యస్థానానికి చేరవేసే ఆటోలు, జీపులు ఇతర ప్రయివేట్ రవాణా వాహనాలు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని తెలిపారు. వాహనదారులు రహదారులలో విధించిన వేగపరిమితిని మించి అతివేగంగా ప్రయాణం చేయరాదని, తప్పనిసరిగా నిబంధనలను పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రాణాలతో పాటు కుటుంబాన్ని కూడా కాపాడుకోవచ్చని అన్నారు.. అనంతరం అధికారులు, విద్యార్థులతో ట్రాఫిక్ నిబంధనలపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకటరమణ, టీఎస్ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీధర్, ఎంవీఐలు ఉమామహేశ్వర్, సంతోష్, ఏఎంవీఐ మోహన్ గౌడ్ పాల్గొన్నారు.

వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు

● ఆసిఫాబాద్ డీఎఫ్ఓ నీరజ్‌కుమార్ తెబ్రివాల్



మాట్లాడుతున్న డీఎఫ్ఓ నీరజ్‌కుమార్ తెబ్రివాల్

నవతెలంగాణ-బెజ్జూరు

వన్య ప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆసిఫాబాద్ డీఎఫ్ఓ నీరజ్‌కుమార్ తెబ్రివాల్ అన్నారు. మంగళవారం బెజ్జూరు రేంజ్‌లోని చిన్నసిద్దాపూర్, సులుగుపెల్లి గ్రామాల్లో అడవి జంతువులు, వన్యప్రాణుల సంరక్షణపై ప్రజలకు అటవీ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎఫ్ఓ నీరజ్‌కుమార్ మాట్లాడుతూ అడవి జంతువుల వల్ల పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందజేస్తామని తెలిపారు. బెజ్జూరు శివారులోని సర్వేనెంబర్ 762 పోడు భూములపై రెవెన్యూ, అటవీ శాఖ అధికారులతో సంయుక్తంగా సర్వే నిర్వహించి రైతులకు న్యాయం చేస్తామని తెలిపారు. తునికాకు రాయల్టీ రానివారికి నెలరోజుల్లోగా డబ్బులు ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పులి దాడుల వల్ల నష్టపోయిన పశువుల యజమానులకు ప్రభుత్వం వెంటనే పరిహారం అందజేస్తుందని, పులిని సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అటవీ గ్రామాల్లో ఉచ్చులు ఏర్పాటుచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోడు భూముల్లో గిరిజనేతరులకు పట్టాలివ్వాలని, గిరి వికాస్ విద్యుత్ మోటార్లు, పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని ఎంపీటీసీ పర్వీన్ సుల్తానా, స్థానిక సర్పంచ్ రవికుమార్ కోరారు. అటవీ గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని డీఎఫ్ఓ హామీ ఇచ్చారు. కర్జెవెల్లి రేంజ్‌లోని సమ్మక్క, సారలమ్మ గుట్ట వద్ద చెక్‌డ్యాంకు మరమ్మత్తులు చేపట్టాలని కోరారు. చిన్నసిద్దాపూర్ గ్రామంలో వారానికి ఒకసారి సమావేశం ఏర్పాటు చేయాలని అటవీ అధికారులకు ఆదేశించారు. అటవీ అభివృద్ధి పనులకు గ్రామస్తులు సహకరించాలని కోరారు. అనంతరం వన్యప్రాణుల సంరక్షణ, అడవుల అభివృద్ధిపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో బెజ్జూరు ఫారెస్ట్ రేంజ్ అధికారి దయాకర్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ అచ్యుత్‌రావు, లైన్ ఇన్స్‌పెక్టర్ రాజేశం, ఏఈఓ మీనా, ఎస్సై విక్రమ్, సర్పంచ్ రవికుమార్, ఎంపీటీసీ పర్వీన్‌సుల్తానా, వీఎస్ఎస్ అధ్యక్షుడు కె.రామకృష్ణ, వీఏ జితేందర్, సెక్షన్ అధికారులు శ్రీనివాస్, బీట్ అధికారులు వెంకటేశ్, శ్రీధర్, ముత్యం పాల్గొన్నారు.


సింగరేణిలో 22 జీఓను అమలు చేయాలి

నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణిలో కాంట్రాక్టు కార్మికుల కోసం 22 జీఓను అమలు పరచాలని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం(సీఐటీయూ) జిల్లా ఉపాధ్యక్షుడు ఓదేలు డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న 10 సంవత్సరాలు కార్మికులను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. సింగరేణి అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు చాలీచాలని జీతాలతో కుటుంబపోషణ చేయలేక ఎన్నో ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాంట్రాక్టు కార్మికులను నమ్మించి మోసం చేసిందని, కాంట్రాక్టు కార్మికుల కోసం కనీస వేతనం పెంపుదలకు ఏనాడు కూడా కాంట్రాక్టు కార్మికులను పట్టించుకోలేదన్నారు. 2021 జూన్ నెలలో జీవో నెంబర్ 22ను విడుదల చేసినట్టే చేసి దానిని గెజిట్ చేయకుండా, సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు జీతాలు పెంచకుండా ఆర్థిక ఇబ్బందులకు గురిచేశారన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సింగరేణి కాంట్రాక్టు కార్మికుల కనీస వేతనాలు పెంచి పర్మినెంట్ చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజావాణిలో దరఖాస్తు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సింగరేణి ప్రయివేటు సెక్యూరిటీ గార్డ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మేకల జాక్సన్, ఉపాధ్యక్షుడు ఎండీ యూసుఫ్, గోర్లకుంట రాజశేఖర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కోట శేఖర్, కోశాధికారి కోట ప్రభాకర్, నాయకులు శంకర్, జంగు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక ఎదుగుదల

● ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

క్రీడలతో శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసంతో పాటు ఎంచుకున్న లక్ష్యసాధనలో ఏకాగ్రత పెంపొందుతుందని కలెక్టర్ బొర్కాడే హేమంత్ అన్నారు. మంగళవారం జిల్లాలోని అంకుసాపూర్‌లో గల ప్రభుత్వ వైద్య కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన క్రీడా పోటీలకు జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఎస్పీ సురేష్ కుమార్, ఆసిఫాబాద్ శాసనసభ్యులు కోవ లక్ష్మిలతో కలిసి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ వైద్య కళాశాలలలో భాగంగా జిల్లాలోని అంకుసాపూర్‌లో మంజూరైన వైద్య కళాశాల నిర్మాణం చేసుకొని వైద్య విద్య ప్రథమ సంవత్సరం తరగతులను నిర్వహించడం జరుగుతుందని, విద్యార్థులు మంచి క్రమశిక్షణతో ప్రభుత్వం కల్పించిన వసతులతో వైద్య విద్యను అభ్యసించి భవిష్యత్తులో జిల్లాలో ప్రజలకు సేవలు అందించాలని అన్నారు. కళాశాలలో సమస్యలు పరిష్కరించి అభివృద్ధికి ప్రిన్సిపల్ నాగార్జున చారి చేస్తున్న కృషి అభినందనీయమని, ఏ సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం దిశగా కృషి చేస్తున్నారని అన్నారు. కళాశాలలో ఫ్యాకల్టీ, సిబ్బంది కొరతను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నియామకాలు చేపట్టేందుఉ చర్యలు తీసుకుంటామని అన్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా అల్పాహారం, భోజనం, నిద్ర సమయానుసారంగా తీసుకోవాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపల్ నాగార్జున చారి, వైద్య ఆరోగ్యశాఖ అధికారి తుకారం, జిల్లా పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్, ఆసిఫాబాద్ జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు, ఎంపీపీ మల్లికార్జున్, వైద్యాధికారులు, అధ్యాపకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పశుమిత్రలకు గౌరవ వేతనం ఇవ్వాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



పశుసంవర్ధక శాఖలో పనిచేస్తున్న పసుమిత్రలకు గౌరవ వేతనం అందించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు కృష్ణమాచారి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో పశుమిత్రుల సంఘం అధ్యక్షురాలు గోవిందుల సునీత అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుమిత్రలు పశుసంవర్ధక శాఖకు పశు పోషకులకు వారధిగా పనిచేస్తున్నారని అన్నారు. వీరికి ప్రభుత్వం ఎలాంటి గౌరవ వేతనం గానీ, పారితోషికం గాని ఇవ్వకుండా వెట్టి చాకిరీ చేయించుకోవడం సరైనది కాదన్నారు. గుర్తింపు కార్డులు, యూనిఫాం, గ్లౌజులు, మాస్కులు, మెడికల్ కిట్‌లు, ఇవ్వాలని డిమాండ్ చేశారు. పశు మిత్రలందరికీ ఏఐ ట్రైనింగ్ ఇవ్వాలని అన్నారు. పశు మిత్రలకు ఇతర స్కీమ్ వర్కర్స్‌కు ఇస్తున్నట్లుగా గౌరవ వేతనం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. పై డిమాండ్ల సాధనకు భవిష్యత్తు కర్తవ్యాలుగా ఫిబ్రవరి 5వ తేదీన జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నామని దీనికి అన్ని మండలాల పశుమిత్రలు కాగజ్‌నగర్ సీఐటీయూ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు జరుగు సమావేశానికి సకాలములో హాజరు కావాలని అదే విధంగా సమస్యలపై వినతి పత్రాలు ఇవ్వాలని తెలిపారు. ఈ సమావేశంలో పశుమిత్రలు కుడిమెత శ్రీలత, గోవిందుల సునీత, దుర్గం సునీత, బామిని వనితా, ఏనుక సుజాత, సోయం పుష్ప, వెద్మా కవితా, ఊర్మిల పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధికి సమన్వయంతో పని చేయాలి

● అదనపు కలెక్టర్ దీపక్ తివారి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని గ్రామపంచాయతీల అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మంగళవారం అన్ని మండలాల మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో గ్రామపంచాయతీల అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 31వ తేదీతో సర్పంచ్‌ల పదవీకాలం ముగియనుండడంతో వారి వద్ద ఉన్న డిజిటల్ 'కీ'లు మండల పరిషత్ అభివృద్ధి అధికారులు తీసుకొని జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో సమర్పించాలని, పంచాయితీ కార్యదర్శుల హాజరును పర్యవేక్షించాలని తెలిపారు. గ్రామపంచాయతీలకు ప్రత్యేక అధికారుల జాబితా రూపొందించాలని, గ్రామపంచాయతీలలో 100 శాతం పన్నుల వసూలుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీల హాజరు శాతం పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కేంద్ర బృందం గ్రామపంచాయతీల తనిఖీకి వచ్చే అవకాశం ఉందని, రికార్డులు, రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని, గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను రూపొందించి సిద్ధం చేయాలని, ఈజీఎస్ సామాజిక తనిఖీలను చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే కోవలక్ష్మి అన్నారు. మంగళవారం తనను మర్యాదపూర్వకంగా కలిసిన విశ్రాంత ఉద్యోగులతో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగులు తమ జీవితంలో ప్రభుత్వ పథకాల పంపిణీలో కృషి చేస్తారని అన్నారు. పదవి విరమణ చెందిన తర్వాత విశ్రాంత జీవితం సంతోషంగా ఉండాలంటే ప్రభుత్వం నుంచి వచ్చే బెనిఫిట్స్ రావాలన్నారు. దీనికోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం ఆమెను వారు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గరిపెల్లి కరుణాగౌడ్, కోశాధికారి లింగన్న, నాయకులు నాంపల్లి శంకర్, వెంకటేష్, పుల్లూరి కిష్టయ్య, రాజేశ్వర్ల వినోద్, సుభాష్ సింగ్, గజ్జల పోచన్న పాల్గొన్నారు.

వట్టివాగు కాలువల పరిశీలన



నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని వట్టివాగు ప్రాజెక్టు కాలువలను, చెరువులను మంగళవారం కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు రైతులతో కలిసి పరిశీలించారు. రెబ్బెన గ్రామ పంచాయతీ పరిధిలోని పుంజుమేరగూడ, నక్కలగూడ, మద్దికుంట ఆయకట్టు రైతులకు యాసంగి పంటలకు సాగునీరు అందించేలా కృషి చేయాలని గతంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుని దృష్టికి తీసుకెళ్లారు. మండలంలోని బీ8 బీ9 బీ10 కాలువలను పరిశీలించగా వట్టివాగుకు సంబంధించిన కాలువలు తుంగతో నిండి ఉండడాన్ని గమనించారు. అలాగే కొన్ని చెరువులను పరిశీలించారు. కుమ్మరికుంట, అడవి చెరువులకు మరమ్మత్తులు చేయించాలని రైతులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మరమ్మత్తులు చేయించి యాసంగి పంట చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించేలా కృషి చేస్తానని విశ్వప్రసాద్ రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎల్ రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గం దేవాజీ, సీనియర్ నాయకుడు, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు మోడెం సుదర్శన్‌గౌడ్, వనమాల మురళీ, మోడెం చిరంజీవిగౌడ్, వడాయి నాగేష్, ఆవిడపు గోపి, దుర్గం అన్నాజీ, మండల నాయకులు సురేష్, చౌదరి దుర్గాదాస్, రైతులు వడాయి కాంతారావు, వడాయి గణపతి, వీసయ్య, రావూజీ, కిరణ్, బాలకృష్ణ, లావుడె కిషన్ పాల్గొన్నారు.

మహాత్మా గాంధీ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మహాత్మా గాంధీ జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శమని ఆసిఫాబాద్ వాసవి క్లబ్ అధ్యక్షుడు కొలిపాక శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద వాసవి క్లబ్ ఆధ్వర్యంలో మహాత్మ గాంధీ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గాంధీ విగ్రహానికి పూలమాలవేసి స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా రోడ్లు ఊడ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాత్మా గాంధీ యావద్దేశం గర్వపడాల్సిన గొప్ప వ్యక్తి అన్నారు. ఆయన దేశానికి చేసిన సేవలు ఎనలేనివని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ ప్రధాన కార్యదర్శి తాటిపల్లి ఆదిత్య, కోశాధికారి చిలువేరి శ్రీధర్, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సభ్యులు ఎక్కిరాల శ్రీనివాస్, కిరణా అసోసియేషన్ సభ్యులు గుండా ప్రమోద్, గుండ వెంకటేశ్వర్లు, గంధం వేణుగోపాల్, పిన్న వివేక్, మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షులు గంధం శ్రీనివాస్, చిలువేరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జైనూర్ : మహాత్మాగాంధీ జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో మహాత్మాగాంధీ వర్ధంతిని నిర్వహించి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహాత్మాగాంధీ జీవితం అందరికి ఆదర్శమైందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల బృందం పాల్గొన్నారు.

రేపు ఉమ్మడి జిల్లా ఎన్నికల అధికారులతో సమావేశం

నవతెలంగాణ-నస్పూర్

ఫొటో ఓటరు జాబితా సవరణ కార్యక్రమం-2024లో మంచిర్యాల, కొమురంభీం ఆసిఫాబాద్, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలకు ఓటరు జాబితా పరిశీలకులుగా నియమించబడిన ప్రభుత్వ సంస్థలు, శాఖల ప్రత్యేక కార్యదర్శి బి.భారతి లక్పతి నాయక్ ఫిబ్రవరి 1వ తేదీన నిర్మల్ కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించనున్న సమావేశానికి హాజరవుతారని, ఈ సమావేశానికి మంచిర్యాల, కొమురంభీం ఆసిఫాబాద్, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల ఎన్నికల అధికారులు, సహాయ ఎన్నికల అధికారులు, రిటర్నింగ్ అధికారులు, బూత్ స్థాయి అధికారులు హాజరవుతారని, జిల్లా శాఖల సంబంధిత అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలతో హాజరు కావాలని తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-దండేపల్లి



మండలంలోని రాజుగూడా గ్రామానికి చెందిన పురుక శ్రీకాంత్ రోడ్డు ప్రమాదంలో గాయపడగా స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆకుల దుర్గాప్రసాద్, కనక జంగు, కొమరం లింగారావ్ రూ.ఐదు వేల ఆర్థిక సాయం బాదితుడికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయనకు అన్ని విధాలుగా అండగా ఉంటామని చికిత్సకు సహకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తోడసం జంగు, కనక రమేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి



నవతెలంగాణ-హాజీపూర్

హెల్మెట్ ధరించండి ప్రాణాలు కాపాడుకోవాలని జిల్లా రవాణాశాఖ అధికారి లెక్కల కిష్టయ్య అన్నారు. 37వ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా జిల్లా రవాణా శాఖ కార్యాలయం నుంచి వేంపల్లి వరకు హెల్మెట్ ధరించి మోటార్ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీసీ కిష్టయ్య మాట్లాడుతూ రోడ్డు భద్రతాపై జనవరి 15 నుండి ఫిబ్రవరి 14వరకు రహదారి భద్రత మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాహనదారులు విధిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించి ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ వాహనాలు నడపాలని కోరారు. వేగంగా వాహనాలు నడుపుతూ ప్రాణాలు కోల్పోవద్దని ఇతరులకు నష్టం చేకుర్చద్దని అన్నారు. రోడ్డు ప్రమాదాలకు గురై కుటుంబాలను రోడ్డున వేయవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ రాహుల్ పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా కుక్కలకు టీకాలు వేయించాలి



నవతెలంగాణ-జైపూర్

ఇంటిలో పెంచుకుంటున్న కుక్కలకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలని భీమారం పశువైద్యాధికారి రాకేష్ సూచించారు. జంతు సంరక్షణ పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం భీమారం మండల కేంద్రంలో గల పశు వైద్యశాలలో పెంపుడు కుక్కలకు రేబీస్ వ్యాధి నిరోదక టీకాలు వేసిన ఆయన పెంపుడు కుక్కల యజమానులతో మాట్లాడారు. నివాసాల్లో పెంచుకుంటున్న కుక్కల పట్ల తీసుకోవల్సిన జాగ్రత్తలు వివరించారు. పెంపుడు కుక్కల ద్వార ఇరుగు పొరుగు వారికి ఎలాంటి ఇబ్బంది రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ సంధర్భంగా మండల పరిధిలో గల 40 పెంపుడు కుక్కలకు టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్య సహాయకులు నర్సిములు, గోపాలమిత్ర సంపత్, రమేష్ పాల్గొన్నారు.

జంతు సంరక్షణ సామాజిక బాధ్యత



నవతెలంగాణ-దండేపల్లి

జంతు సంరక్షణ అనేది సామాజిక బాధ్యతఅని మండల పశువైద్యాధికారి ధనరాజ్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జంతు సంరక్షణ సంక్షేమం పక్షోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు జంతువుల సంరక్షణ అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంతుల సంరక్షణకు ఈ పక్షోత్సవాలు నిర్వహిస్తున్నామని వన్య ప్రాణుల సంరక్షణతో సహజ వాతావరణాన్ని రక్షించుకోవచ్చని ఆయన అన్నారు. ప్రతి పౌరుడు మూగజీవాల పట్ల దయా కరుణ కలిగి ఉండాలని గ్రామాల్లోని కుక్కలకు రెబిస్ వ్యాధి సోకకుండా టీకాలు వేస్తున్నామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బీసాగొని శంకర్ గౌడ్ పాల్గొన్నారు.

శిశువుల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి



నవతెలంగాణ-జైపూర్

శిశువుల ఆరోగ్యం పట్ల తల్లితండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని బెజ్జాల జయపాల్ గౌడ్ సూచించారు. మద్దులపల్లి గ్రామంలో గల అంగన్‌వాడి కేంద్రంలో స్థానిక అంగన్‌వాడి కార్యకర్త సునితతో కలిసి మంగళవారం బాలామృతం పంపిణీ చేశారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వార పంపిణీ చేస్తున్న బాలామృతం సధ్వినియోగం చేసుకోవాలని, గర్భిణీ స్త్రీలతో పాటు కేంద్రానికి వచ్చే పిల్లలకు కోడి గుడ్లు ఉడికించి పెట్టడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రం ద్వార పాలప్యాకెట్లు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు.

వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతి

నవతెలంగాణ-లక్షెట్టిపేట



వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక కాలేజీ గ్రౌండ్‌లో గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ అహింస, శాంతి మార్గాలను పాటించాలని, యువతకు మహనీయుడు చేసిన సేవలను వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బొప్ప సతీష్, వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

మందమర్రి : గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం మున్సిపాలిటీ కార్యాలయంలో మహాత్మ గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. మున్సిపల్ కమిషనర్ గద్దె రాజు గాంధీ చేసిన సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్లు రాణి, ప్రవీణ్, జూనియర్ అసిస్టెంట్ జాఫర్ అహ్మద్, వార్డు ఆఫీసర్లు రాజన్న, ఇన్‌ఛార్జి టౌన్ మిషన్ కోఆర్డినేటర్ రఘురాం, డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్ బొల్లు శ్యాంబాబు, సిస్టం మేనేజర్ శిరీష్, పబ్లిక్ హెల్త్ వర్కర్ అరుణ, భాను, శంకర్, గట్టయ్య పాల్గొన్నారు.

కాసిపేట : మండలంలోని పెద్దనపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో మహాత్మా గాంధీ 76 వ వర్ధంతిని సర్పంచ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేముల కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వేముల కృష్ణ మాట్లాడుతూ మనకు శాంతియుత పద్దతులతో స్వాతంత్ర్యం తెచ్చిన మహాత్ముడని కొనియాడారు. పల్లెలు బాగుంటేనే దేశం బాగుంటుందనే నినాదంతో ప్రజల్లోకి తీసుకెళ్ళారు. తను దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కామెర శ్రీనివాస్, ఉప సర్పంచ్ తిరుమల్, వార్డు సభ్యులు కొత్త రమేష్, పంబాల తిరుపతి, మాజీ ఎంపీటీసీ చింతపురి కృష్ణ, నాయకులు శ్రీనివాస్, శ్రీధర్, ఎల్లయ్య, మార్నేని లక్ష్మన్ పాల్గొన్నారు





జీపీ నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలి

నవతెలంగాణ-తాండూర్



సభ్యుల ఆమోదం లేకుండా పనులు నిర్వహించినట్లు రికార్డులు సృష్టించి నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డ పంచాయతీ సెక్రెటరీపై వెంటనే చర్యలు తీసుకోవాలని తాండూర్ పంచాయతీ వార్డు సభ్యులు కోరారు. మంగళవారం పంచాయతీ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి తప్పుడు లెక్కలను సృష్టించి నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డట్టు ఆరోపించారు. పారిశుధ్య నిర్వహణ అంతర్గత రహదారుల నిర్వహణలో పంచాయతీ కార్యదర్శి అవినీతికి పాల్పడ్డట్టు ఆరోపించారు రేచీని రైల్వే స్టేషన్, సుభద్ర కాలని, ఎస్సీ కాలనీలో చేపట్టిన పనుల్లో నిధులు దుర్వినియోగం అయినట్టు ఆరోపించారు. తాండూరు గ్రామపంచాయతీ సాధారణ సమావేశంలో భాగంగా మంగళవారం ఇన్‌ఛార్జి సర్పంచ్ నవీన్ కుమార్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సమావేశానికి గ్రామపంచాయతీకి చెందిన 14 మంది వార్డు సభ్యులు పాల్గొన్నారు. వార్డు సభ్యులకు ఎలాంటి తీర్మానాలు లేకుండా గ్రామపంచాయతీ నుంచి పలు నిధులు దుర్వినియోగం జరిగాయని వాటిపై సభ్యులు సర్పంచ్, ఈఓను వివరణ కోరగా ఎలాంటి సమాధానం ఇవ్వడం లేదన్నారు. సర్పంచ్, సెక్రెటరీ అవినీతికి పాల్పడుతూ ఇష్ట రాజ్యాంగ వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు నిరసన తెలిపిన వారిలో వార్డు సభ్యులు తిరుపతి, పెద్ద బోయిన రాజేశం, సిద్ధం స్రవంతి, కొండు జ్యోతి ఉన్నారు.

గ్రంథాలయాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్

నవతెలంగాణ-లక్షెట్టిపేట

పట్టణములోని గ్రంథాలయాన్ని మంగళవారం అదనపు కలెక్టర్ బి.రాహుల్ సందర్శించినారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయ అభివృద్ధికి పలు సూచనలు చేశారు. పాఠకులకు ఇబ్బంది కలగకుండా అదనంగా రెండు గదులు కేటాయించాలని కోరారు. విద్యుత్ సౌకర్యాన్ని వెంటనే కల్పించాలని ఆదేశించారు. ఫర్నిచర్ తదితర సౌకర్యాలను ఏర్పాటు చేయాలని కోరారు. తాగునీటి వసతి కల్పించడంతోపాటు, అన్ని రకాల పోటీ పరీక్షల పుస్తకాలు, న్యూస్ పేపర్స్, పోటీ పరీక్షల అభ్యర్థులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమములో మున్సిపల్ కమిషనర్ కల్లేడ రాజశేఖర్, ఎంపీడీఓ కె.నాగేశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ టీ.రాఘవేందర్ రావు, గ్రంథాలయ అధికారి రాజు, గ్రంథాలయం ఇన్‌ఛార్జి రమేష్, పాల్గొన్నారు.

దండేపల్లి : మండల కేంద్రంలో గ్రంథాలయ నిర్మాణానికి మంగళవారం అదనపు కలెక్టర్ బి.రాహుల్ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణానికి రూ.30 లక్షల నిధులు మంజూరు అయినట్లు తెలిపారు. వీలైనంత తొందరగా మండల ప్రజలకు గ్రంథాలయాన్ని అందుబాటులోకి తెస్తామని ఆయన తెలిపారు. ఎన్నో మంచి విషయాలను ప్రజలకు పుస్తకాల రూపంలో అందించే గ్రంథాలయాన్ని నిర్మిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మల్లేశం సర్పంచ్ చంద్రకళ పంచాయతీ కార్యదర్శి శ్రీలత, గ్రంథాలయ మాజీ డైరెక్టర్ చీర్ల వెంకటేశ్వర్లు, దండేపల్లి యూత్ అధ్యక్షుడు బొమ్మెన మహేష్ పాల్గొన్నారు.





మహిళల అభివృద్ధికి మహిళా సాధికారత హబ్

నవతెలంగాణ-జైపూర్

బాలికల, మహిళల సంరక్షణ, సంక్షేమం, అభివృద్ధి కొరకు మహిళా సాధికారత హబ్ పని చేస్తుందని మహిళా సాధికారత హబ్ జిల్లా సమన్వయకర్త సౌజన్య అన్నారు. మంగళవారం మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో హబ్ జెండర్ స్పెషలిస్టు విజయతో అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మహిళా సాధికారత హబ్ జిల్లా సమన్వయకర్త మాట్లాడుతూ జిల్లా సంక్షేమశాఖ అధికారి ఆదేశాల మేరకు మహిళా సాధికారత హబ్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో బాలికలు, మహిళల సంరక్షణకు చేపట్టిన కార్యక్రమాలు, మహిళా చట్టాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. బేటి బచావో-బేటి పడావో, లింగ వివక్ష, లింగ సమానత్వం, గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షల నిరోధక చట్టం, బాలిక విద్య, బాల్యవివాహాల నిరోధక చట్టం, గుడ్ టచ్-బాడ్ టచ్, మహిళా హెల్ప్ లైన్ 181, చైల్డ్ హెల్ప్ లైన్ 1098, పోలీస్ హెల్ప్ 100, సీనియర్ సిటిజన్ హెల్ప్ లైన్ 14567 అంశాలపై వివరించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సన్మానం

నవతెలంగాణ-కాసిపేట



మండలంలోని ముత్యంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మోటివేషన్ చారిటబుల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన జాతీయ స్థాయి కలోత్సవాల్లో ప్రదర్శన ఇచ్చి ప్రతిభ చూపిన విద్యార్థులు బిందు ప్రియ, నరేందర్‌తో పాటు ఆ స్థాయిలో ప్రోత్సహించి కష్టపడిన హెచ్ఎం వెంకటేశ్వర స్వామి, ఉపాధ్యాయులు బండ శాంకరి, పుష్పలతలను ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా మోటివేషన్ చారిటబుల్ వెల్ఫేర్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ప్రవీణ్ నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక కళలలో కూడా నైపుణ్యం చిన్నపటి నుండే అలవర్చుకోవాలన్నారు. ఛారిటీ డైరెక్టర్ ప్రకాష్ పదవ తరగతి విద్యార్థులకు పరీక్షల భయం నుంచి ఉపశమనం కలిగించే విధంగా ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తున్నారని, ఎవరైనా ఇబ్బంది అనిపిస్తే నేరుగా ఫోన్‌లో సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఛారిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ అర్చన, ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర స్వామి, ఉపాధ్యాయులు పుష్పలత, శాంకరి, జ్యోతి, కృష్ణ గోపాల్, మాధవి లత పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్

- మరో 7గురు కౌన్సిలర్లు



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్ జంగం కళ, వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డితో పాటు మరో ఏడుగురు కౌన్సిలర్లు సోమవారం రాత్రి, మంగళవారం ఒక కౌన్సిలర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇటీవల ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై మున్సిపాలిటీలో రాజకీయం సర్వత్రా ఉత్కంఠగా మారింది. సొంత పార్టీకి చెందిన మున్సిపల్ చైర్మెన్, వైస్ చైర్మెన్లపై పెట్టిన అవిశ్వాసం సమయం దగ్గర పడుతున్న కొద్ది కండువాలు మార్చే పనిలో పడ్డారు. కౌన్సిలర్లు, ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ కౌన్సిలర్లపై ఎలాంటి చర్యలు తీసుకుంటారని ఆసక్తి నెలకొంది. మిగతావాళ్లు కూడా పార్టీ మారే ఆవకాశాలు ఉన్నందున క్యాంప్ రాజకీయాలను నమ్ముకున్నట్టు తెలుస్తోంది. క్యాతన్‌పల్లి మున్సిపల్ చైర్మెన్ అవిశ్వాసం ఎటువైపు తిరుగుతుందో తెలియాలంటే మరో వారం పడుతుందని తెలుస్తోంది. బీఆర్ఎస్ పట్టణ నాయకుల సమక్షంలో ఒకచోటకు తరలించారని విశ్వసనీయ సమాచారం.

సింగరేణి లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో బొమ్మల కొలువు



నవతెలంగాణ-నస్పూర్

కనుమరుగవుతున్న సంస్కృతి, సాంప్రదాయాలు భావితరాలకు తెలిసేలా సింగరేణి లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో ఇల్లందు క్లబ్లో మంగళవారం బొమ్మల కొలువు ఘనంగా నిర్వహించారు. శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి సేవా సమితి అధ్యక్షురాలు, బీఎం సతీమణి రాధాకుమారి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం నాయక్ సతీమణి హరిణి, డైరెక్టర్(ఈ అండ్ ఎం) శ్రీనివాస్ సతీమణి కళ్యాణి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన అయోధ్య రామ మందిరం, సమ్మక్క సారలమ్మ వన దేవతలు, పర్ణశాల, బృందావనం, నాగేశ్వర్ ఆకృతులు ఎంతగానో అలరించాయి. ఈ సందర్భంగా లేడీస్ క్లబ్ మహిళలు చేసిన నృత్య ప్రదర్శన, వేషధారణలు పలువురిని ఆకట్టుకున్నాయి. బొమ్మల కొలువు కార్యక్రమాన్ని దిగ్విజయంగా ఏర్పాటుచేసిన శ్రీరాంపూర్ ఏరియా లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు రాధా కుమారిని, శ్రీరాంపూర్ ఏరియా లేడీస్ క్లబ్ సభ్యులను ముఖ్య అతిథులు అభినందించారు. బొమ్మలకొలువు సందర్భంగా చిన్న పిల్లలకు భోగి పండ్లను పోశారు. ఈ కార్యక్రమంలో సుధ శ్రీనివాస్, సవిత మనోహర్, భవాని బసివి రెడ్డి, లలిత గుప్తా పాల్గొన్నారు.

జంతు సంక్షేమ సంరక్షణ పక్షోత్సవాలు



నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలోని ప్రభుత్వ పశు వైద్యశాలలో మంగళవారం మండల పశువైద్యాధికారి డాక్టర్ కస్తూరి శ్రీకాంత్ ఆధ్వర్యంలో జంతు సంక్షేమ, సంరక్షణ పక్షోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ పెంపుడు జంతువులు, పక్షులు, వన్య ప్రాణులు, పాడి పశువులు, మూగ జీవాలు పట్ల జాలి, కరుణ, దయ కలిగి ఉండాలన్నరు. వాటి పట్ల మన ప్రవర్తన, భాధ్యత, సంరక్షణ గురించి జంతు ప్రేమికులకు తెలిపారు. పెంపుడు జంతువులు వాటికి వచ్చే వ్యాధులు వాటి వలన మనుషులకు సంక్రమించే వ్యాధులు గురించి అవగాహన కల్పించారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన జంతు ప్రేమికులు పాల్గొన్నారు. 126 జంతువులకు ఉచితంగా యాంటీ రేబీస్ వాక్సినేషన్ వ్యాక్సిన్లు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్య పశు సంవర్ధక శాఖా సిబ్బంది, జంతు ప్రేమికులు, పెంపుడు జంతువుల యజమానులు, పాల్గొన్నారు.

ఓటర్ లిస్ట్ మార్పులు చేర్పులపై సమీక్షించిన ఆర్వో

నవతెలంగాణ-జైపూర్

పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి మండల పరిధిలో ఓటర్ లిస్ట్ మార్పు చేర్పులపై చెన్నూరు నియోజకవర్గం రిటర్నింగ్ ఆఫీసర్ సీడం దత్తు సమీక్షించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన ఓటర్ నమోదు, ఓటర్ లిస్ట్ మార్పు చేర్పులపై పలు సూచనలు చేశారు. అదేవిధంగా పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి రికార్డుల ఆన్‌లైన్, నిర్వాహణ తీరు అడిగి తెలుసుకున్నారు. ఓటర్ లిస్ట్‌తో పాటు వివిధ రకాల రికార్డుల నిర్వహణలో పొరపాటు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించినట్లు తహసీల్దార్ రమేష్ తెలిపారు.

ఆర్గానిక్ వ్యవసాయంపై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కిష్టాపూర్ జడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం ఒకేషనల్ ఎడ్యుకేషన్ ఆర్గానిక్ అగ్రికల్చర్, రిటైలింగ్ ప్రొడక్ట్స్‌పై విద్యార్థులకు ప్రాక్టికల్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గెస్ట్ లెక్చరర్ కానుగంటి లక్ష్మన్ వర్మ ఆర్గానిక్ వ్యవసాయ గొప్పదనం, భూసారం దెబ్బ తినడం వల్ల నష్టాలు అదేవిధంగా ఆర్గానిక్ వ్యవసాయం చేయడం వల్ల వచ్చేటువంటి లాభాలు విద్యార్థులకు ప్రాక్టికల్ డెమో ద్వారా వివరించారు. రైతులందరూ ఆర్గానిక్ వ్యవసాయం వైపు రావడం వల్ల నేలకు కలిగేటువంటి లాభాలు, అదే విధంగా మనుషుల ఆరోగ్య విధానంలో వచ్చే మార్పు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుండ రాజన్న, ఉపాధ్యాయులు దాముఖ కమలాకర్, దాసరి శేఖర్, అశోక్ పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరించిన ఎస్పీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా సమితి ఆధ్వర్యంలో రూపొందించిన నూతన క్యాలెండర్‌ను జిల్లా ఎస్పీ గౌస్ ఆలం చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంగళవారం ఎస్పీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ముందుగా పూలమొక్కను అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఏఐవైఎఫ్ నాయకులు జిల్లాలో విద్యార్థులు, యువత చెడు అలవాట్లు దూరం చేసే విధంగా మంచి కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి జాషువ, మెస్రం భాస్కర్ మాట్లాడుతూ యువజన, విద్యార్థి సమస్యల పరిష్కారమే ఎజెండా ఏఐవైఎఫ్ ప్రధాన కర్తవ్యమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ ద్వారా ఉద్యోగాల భర్తీ జరపాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు గెడం దీపక్, పెందూర్ తుకారాం, కనక దత్తు, సురేష్, గోపి, సలాం వరుణ్ పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని గుంజాల గ్రామపంచాయతీలో మంగళవారం వైద్య సిబ్బంది కుష్టు వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. పాఠశాలలో విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ముందుగా కుష్టు వ్యాధిపై ప్రతిజ్ఞ చేశారు. అవగాహన కార్యక్రమంలో సర్పంచ్ సావిత్రి బాయి, ఉపసర్పంచ్ చునార్కర్ చందా, ఏఎల్ హెచ్‌పీ హిమ బిందు, సూపర్‌వైజర్, చరణ్‌దాస్, వైద్య సిబ్బంది ఈశ్వరి, విద్యారాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చౌహాన్ రామారావ్, ఆశాలు సత్యశీలా, నాగుబాయి ఉన్నారు.

కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాల ఐక్య వేదిక సమావేశంలో ఆయన పాల్గొని, కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగట్టారు. కేంద్రం వైఖరిని ఖండిస్తూ చేపట్టనున్న నిరసన కార్యక్రమలపై సంఘం నాయకులతో కలిసి చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి విలాస్ మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రం నాలుగు కోడ్‌లుగా మార్చిందని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ చేస్తూ ఉద్యోగులను ఇబ్బంది పెడుతోందని మండిపడ్డారు. కేంద్రం తీరుకు నిరసనగా ఫిబ్రవరి 16న చేపట్టనున్న దేశ వ్యాప్తబంద్‌ను విజయవంతం చేయాలనీ పిలుపునిచ్చారు. అదేవిధంగా ఫిబ్రవరి 5న కార్మిక సంఘాల ఐక్య వేదిక ద్వారా పట్టణంలో సదస్సును నిర్వహించనున్నట్టు తెలియజేశారు. ఈ సదస్సును విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఆయా సంఘాల, పార్టీల నాయకులు సిర్ర దేవేందర్, కుంటాల రాములు, బండి దత్తాత్రి, ఆశన్న, రాములు పాల్గొన్నారు.

ముక్తా సాల్వే ఆశయాలు కొనసాగిద్దాం

నవతెలంగాణ-నార్నూర్

మాతంగ్ సమాజంలోని మొదటి విద్యార్థిని ముక్తా సాల్వే ఆశయాలు ముందుకు కొన సాగిద్దామని అన్నాభావు సాతే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింగ్ మోరే అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ముక్తా సాల్వే 183వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా ముక్తా సాల్వే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంగ్లేయుల పాలనలో దళిత, బలహీన వర్గాల విద్య హక్కులపై బ్రిటిష్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారని ఆయన అన్నారు. ముక్తా సాల్వే ఆశయాలకు అనుగుణంగా రేపటి తరానికి చదువుకోవడానికి ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఇన్‌చార్జ్ చైర్మెన్ సురేష్ ఆడే, డైరెక్టర్ కాంతారావ్, అన్నా భావు సాతే అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి బాలాజీ కాంబ్లే, మండల అధ్యక్షుడు కోర్రల మహేందర్, రాణా ప్రతాప్, ముక్తా సాల్వే కమిటీ మండల అధ్యక్షుడు రాజు బర్యుంబే, గణేష్ రాజ్‌పాంగే, రాము జివాలే, సంజీవ్, రాజ్‌పాంగే బాలాజీ, గణేష్ ఉన్నారు.

బాల్య వివాహాలు అరికట్టాలి



నవతెలంగాణ-తాంసి

బాల్య వివాహాలు అరికట్టాలని మహిళ సాధికారత కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ యశోధ బాలికలకు పలు విషయాలు తెలియజేశారు. మంగళవారం మండలం కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో, పొన్నారి, బండలనాగాపూర్ కేజీబీవీ, మహాత్మా జ్యోతిభాపూలే, పాఠశాలలో జిల్లా మహిళ సాధికారత, సఖీ ఆధ్వర్యంలో సంయుక్తంగా అవగహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో బాలికల సంరక్షణ, హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగుదల మొదలైన అంశాలపై అవగాహన కల్పించారు. భేటీ బచావో బేటి పడావో పథకం ముఖ్య ఉద్దేశం, బాలికలను రక్షించాలి, చదివించాలి, బాలికల పట్ల వివక్ష ఉండకూడదని అన్నారు. బాల్య వివాహాల చట్టం, బాల్య వివాహాలు వల్ల వచ్చే నష్టాలు, పోక్సో చట్టం, సేఫ్ టచ్ అన్ సేఫ్ టచ్, మిషన్ శక్తి పథకం గురించి వివరించారు. నాగమణి సఖీ కేస్ వర్కర్ సఖీ కేంద్రం సేవలు, హెల్ప్ లైన్ నెంబర్స్, గృహహింస చట్టం సామాజిక స్పందన, గురించి తెలుసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీఎస్ఎస్ పొన్నారి, ఉపాధ్యాయులు, మహిత స్వచ్ఛంద సంస్థ సిబ్బంది. కేజీబీవీ ప్రిన్సిపాల్, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

సీఐ మల్లేష్‌కు ఘనసన్మానం

నవతెలంగాణ-ముథోల్

ముథోల్ పోలీస్ స్టేషన్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన గుమ్మడి మల్లేష్‌ను మంగళవారం కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గంగారెడ్డి ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి, శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు పాటు పడాలని వారు కోరారు. అందరి సహకారంతో శాంతి భద్రతలను కాపాడతానని సీఐ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఆత్మస్వరూప్, నాయకులు ప్రేమ్‌నాథ్‌రెడ్డి, కిషన్ పటేల్, హన్మండ్లు, గోవింద్ పటేల్, అజీజ్, దిగంబర్, సందుర్ యాదవ్ పాల్గొన్నారు.



ఓటరు జాబితా సవరణకు పార్టీలు సహకరించాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కడే హేమంత్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఓటరు జాబితా సవరణకు రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫొటో ఓటరు జాబితా సవరణ కార్యక్రమం-2024లో భాగంగా ఈ నెల 25వ తేదీ వరకు 6, 7, 8 ఫారాల ద్వారా అందిన దరఖాస్తులను ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. ఫిబ్రవరి 2వ తేదీ వరకు జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే తెలియజేయవచ్చని, భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఫిబ్రవరి 8వ తేదీన జాబితా ప్రకటించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని రెండు నియోజకవర్గాలలో కలిపి 21వేల9 దరఖాస్తులు రావడం జరిగిందని, ఓటరు జాబితా రూపొందించడంలో రాజకీయ పార్టీలు తమ వంతు సహకారం అందించాలని తెలిపారు. రాబోవు పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సహాయక పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో ఎన్నికల విభాగం అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పేదల మనోభావాలతో ఆడుకున్న బీఆర్ఎస్ ప్రభుత్వం

- డబుల్ బెడ్‌రూం ఇండ్లను సందర్శించిన ఎమ్మెల్యే
- లబ్ధిదారులకు న్యాయం చేస్తామని హామీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల మనోభావాలతో ఆడుకుందని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. ఎన్నికల సమయాల్లో మాత్రమే డబుల్ బెడ్ రూమ్ పథకాలు ప్రకటించి, లబ్దిదారుల ఎంపిక చేసి మోసం చేసిందని అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం పట్టణ పరిసరాల్లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్లను ఆయన సందర్శించి మాట్లాడారు. ప్రజలను మోసం చేయడమే కాకుండా కమిషన్ల కోసం నాణ్యత లేని ఇండ్లను నిర్మించిందని అన్నారు. పేదలకు ఇండ్లను కేటాయించక ముందే వాటి లోని సానిటరీ వ్యవస్థ, విద్యుత్ వ్యవస్థ చెడిపోయిందన్నారు. మురుగు నీటి పారుదల ఎక్కడ లేదు, తలుపులు కిటికీలు శిథిలావస్థకు చేరుకున్నాయని అన్నారు. గతంలో ఎంపికైన పేదలతో పాటు అర్హులైన పేదలందరికి లబ్దిచేకూరేలా చూస్తామని హామీనిచ్చారు. ఈ విషయం ముఖ్యమంత్రి ముఖ్య సలహాదారులతో మాట్లాడానని ఈ సందర్భంగా తెలిపారు. ఆయన వెంట అధికారులు, నాయకులు ఉన్నారు.

రోడ్డు భద్రతా నియమాలను పాటించాలి



నవతెలంగాణ-ఉట్నూర్

జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవం సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా ఆర్టీఏ అధికారి మహేందర్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ సాయిచరణ్‌ల ఆధ్వర్యంలో సన్‌షైన్ పాఠశాల విద్యార్థులకు మంగళవారం రోడ్డు భద్రత నియమాలపై పోటీ పరీక్షలను నిర్వహించారు. అందులో గెలపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

అంగన్‌వాడీలు నాణ్యమైన సేవలందించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, చిన్నారులకు నాణ్యమైన సేవలందించాలని ఎమ్మెల్యే పాయల శంకర్ సూచించారు. మంగళవారం పట్టణంలోని కేఆర్‌కే కాలనీ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. గర్భిణి మహిళలు, నవజాత శిశువులకు సరఫరా చేసే ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. నాణ్యత లేకుండా ఆహార పదార్థాలను సరఫరా చేసే కాంట్రాక్టర్‌లపై తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఐసీడీఎస్ అధికారులు, గుత్తేదారులు కుమ్మక్కై, నాణ్యత లేని సరుకులను సరఫరా చేస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందని అన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినా, అవినీతికి పాల్పడినా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునేలా చూస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు జోగు రవి, వేదవ్యాస్, రాజేష్, సాయి, ముకుంద్, రాజు పాల్గొన్నారు.

సర్పంచ్ పదవీ కాలాన్ని పొడిగించాలి



నవతెలంగాణ - జైనూర్

సర్పంచ్ పదవీ కాలాన్ని పొడిగించాలని లింగాపూర్ గ్రామ పంచాయతీ సర్పంచుల సంఘం నాయకులు పద్మనాను అన్నారు. మంగళవారం లింగాపూర్ మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్పంచ్‌గా ఎన్నికైన సంవత్సరానికే కరోనాతో రెండు సంవత్సరాలు ప్రజలకు సేవలు అందించకపోయామని తెలిపారు. అదేవిధంగా గ్రామ పంచాయతీలో అభివృద్ధి నిధులు వృథా కావడంతో పాలనకు అనుకూలంగా లేకపోయిందన్నారు. అదేవిధంగా ఎనిమిది నెలల్లో సర్పంచ్ చెక్‌పవర్ లేకపోవడంతో ప్రజల మధ్యలో సర్పంచ్ అనే పదానికి రాజ్యాంగబద్ధంగా విలువ లేకపోయిందని అసహనం వ్యక్తం చేశారు. ప్రజలకు సేవలందించడంలో గ్రామ పంచాయతీని అభివృద్ధి చేయడలంలో రెండు సంవత్సరాల కాలాన్ని కోల్పోయామని తెలిపారు. కష్టసుఖాలను కొత్త ప్రభుత్వం గుర్తించి కనీసం ప్రజాసేవ చేయడానికి మరో సంవత్సరం గడువు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వానికి నివేదికను అందించాలని ఎంపీడీఓ, ఎంపీఓ ఉమర్ షరీఫ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జ్యోతిరాంతో పాటు వివిధ గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అభ్యాసనా సామర్థ్యాలు పెంపొందించాలి



నవతెలంగాణ-లక్ష్మణచాంద

విద్యార్థుల్లో కనీస అభ్యాసనా సామర్థ్యాలు పెంపొందించాలని జిల్లా సెక్టోరల్ అధికారి నర్సయ్య అన్నారు. మంగళవారం మండలంలోని కనకాపూర్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి తనిఖీ చేశారు. విద్యార్థులలో అభ్యాసనా సామర్థ్యాలను, పఠనాసక్తినీ పెంపొందించుటకు ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యా వ్యవస్థను పాఠశాల స్థాయిలోనే పటిష్టం చేసేలా విద్యార్థులను ప్రయివేటు పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తు తోడ్పడాలని పేర్కొన్నారు. ప్రతి నెల మూడో శనివారం పేరెంట్ టీచర్ మీటింగ్స్ ఏర్పాటు చేసి తల్లిదండ్రులను పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు కల్పించేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేశ్వర్, ఉపాధ్యాయులు, సీఆర్పీ సుధాకర్ పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

నవతెలంగాణ-నార్నూర్

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని జెడ్పీ చైర్మెన్ జనార్ధన్ రాథోడ్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా రైతుల వద్ద నుంచి కందులు కొనుగోలు చేసి రైతులకు సకాలంలో డబ్బులు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జాదవ్ చంద్రశేఖర్, ప్యాక్స్ చైర్మెన్ సురేష్ ఆడే, స్థానిక సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్, తుడుం దెబ్బ నాయకులు కనక ప్రభాకర్, మండల కోఆప్షన్ మెంబర్, దస్తగీర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ తొడసం నాగోరావ్, ప్యాక్స్ డైరెక్టర్ దుర్గే కాంతారావ్, మహేందర్, సీఓ గణేష్ అడే ఉన్నారు.

ప్రకృతి విపత్తు సమయంలో సమయస్ఫూర్తితో వ్యవహరించాలి



నవతెలంగాణ-నిర్మల్

ప్రకృతి విపత్తు, వరదలు, తుఫాన్, భారీ భూకంపాల సమయంలో, రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో సమయస్ఫూర్తితో వ్యవహరించాలని 10వ బెటాలియన్ ఎన్‌డీఆర్ఎఫ్ కమాండర్ ఇన్స్‌పెక్టర్ పింటు నంది అన్నారు. విపత్తుల సమయంలో మనల్ని మనం రక్షించుకోవడంతో పాటు ఇతరులను ఏ విధంగా రక్షించాలో వివరిస్తూ మంగళవారం వైఎస్సార్ కాలనీ ప్రభుత్వ ప్రైమరీ స్కూల్ లో జాతీయ విపత్తుల అధికారులు, అగ్నిమాపక సిబ్బంది ప్రదర్శన నిర్వహించారు. నీటిలో మునిగిన వ్యక్తిని ఏ విధంగా ప్రథమ చికిత్స చేయాలి, గ్యాస్ బండ లీక్ అయితే ఏ విధంగా అరికట్టవచ్చో విద్యార్థులకు వివరించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లేశ్, డిప్యూటీ తహసీల్దార్ శేఖర్, ఆర్ఐ వెంకటరమణ, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

స్వాతంత్రోద్యమ అమరులకు శ్రద్ధాంజలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన త్యాగధనులను స్మరించుకుంటూ జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ శ్యామలదేవి ఛాంబర్‌లో సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. అధికారులు, ఉద్యోగులు పాల్గొని స్వాతంత్రోద్యమ అమరులకు శ్రద్ధాంజలి ఘటించారు. అమరుల ఆశయాలను ముందుకు తీసుకెళ్తామనే ధృడ సంకల్పంతో, వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ స్రవంతి, డీఎస్ఓ కిరణ్ కుమార్, డీపీఆర్ఓ విష్ణువర్ధన్, ఈడీఎం రవికుమార్, కలెక్టరేట్ పర్యవేక్షకులు రాంరెడ్డి, నలంద ప్రియా, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు అశోక్, నవీన్, అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

టీఎన్జీవోస్ క్యాలెండర్ ఆవిష్కరించిన

తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం (టీఎన్జీవోస్) క్యాలెండర్ జిల్లా అదనపు కలెక్టర్ శ్యామలదేవి ఆవిష్కరించారు. మంగళవారం ఆమె కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ముందుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి, ఆమె చేతుల మీదుగా క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ మేరకు అదనపు కలెక్టర్ మాట్లాడుతూ టీఎన్జీవోస్ క్యాలెండర్ ఉద్యోగులకు ఉపయోగపడే విధంగా ఉందని కొనియాడారు. పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకురాగా, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు సంద అశోక్, ప్రధాన కార్యదర్శి ఏ.నవీన్ కుమార్, సభ్యులు తిరుమల్‌రెడ్డి, సుజాత, రాధ, రాజేశ్వర్, ఆసూరి ప్రవీణ్, నూర్‌సింగ్, ఓం ప్రసాద్, తాలూకా కార్యదర్శి కె.అరుణ్ కుమార్, సంజయ్, రామకృష్ణ, రజినీకాంత్, అఖిల్ వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థుల కోసం బస్సు నడపాలి

నవతెలంగాణ-ముథోల్

విద్యార్థుల కోసం ఆర్టీసీ అధికారులు బస్సులను నడపాలని ముథోల్ ఎంపీటీసీ దేవోజి భూమేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముథోల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కళాశాలలో విద్యను అభ్యసించడానికి ప్రక్క మండలమైన తానూర్ మండలంలోని దౌలతాబాద్, కర్బాల, దహేగాంతో పాటు ఆయా గ్రామాలకు చెందిన విద్యార్థులు ప్రతిరోజు రాకపోకలు కొనసాగిస్తారన్నారని తెలిపారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాల పనిచేసే దినాల్లో విద్యార్థులకు ఉదయం, సాయంత్రం వేళల్లో ముథోల్ నుంచి ఆయా గ్రామాలకు ప్రత్యేక బస్సులు నడపాలని సూచించారు. బస్సులు నడపకపోవటంతో విద్యార్థులు, విద్యార్థినులకు ఇబ్బందులు తప్పటం లేదన్నారు. అధికారులు స్పందించి విద్యార్థుల సౌకర్యార్థం బస్సును నడపాలని కోరారు.

డ్రైవర్లు అప్రమత్తంగా వాహనాలను నడపాలి

నవతెలంగాణ-సిరికొండ

డ్రైవర్లు అప్రమత్తంగా వాహనాలను నడిపితే ప్రమాదాలను నివారించవచ్చని మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ ప్రదీప్ కుమార్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అన్నారు. మైనర్లు వాహనాలను నడపొద్దని అన్నారు. వేగంగా వాహనాలను నడిపి ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దని అన్నారు. ప్రతి ఒక వాహన చోదకుడు రోడ్డు భద్రత నియమాలను పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సునీల్, డాక్టర్ బి.నరేష్ పాల్గొన్నారు.

జెడ్పీ పాఠశాలలో వైద్య శిబిరం

నవతెలంగాణ-సిరికొండ

ఆర్బీఎస్‌కే ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. విద్యార్థులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని వైద్యులు సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు నరేష్, సుమయ్య, సిబ్బంది అరుణ్, రోజా, సుశీల, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సునీల్ పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి సభ ఏర్పాట్ల పరిశీలన

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఫిబ్రవరి 2న సీఎం రేవంత్‌రెడ్డి మండల పర్యటనకు వస్తున్న సందర్భంగా సీఎంఓ అధికారి శ్రీనివాస్‌తో పాటు ఆర్ అండ్ బి ఎస్ఏ రాజేందర్ నాయక్ హాజరై సభ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వెంట ఐటీడీఏ ఈఈ, డీఆతో కిషన్ ఉన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం మధ్యాహ్నం 1గంటకు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ శేఖర్, ఎంపీపీ అడ్వాల పద్మ రమేష్ ఓక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్టు ఎంపీపీ తెలిపారు. మండల ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

పాడి రైతులు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-ముథోల్

మండలానికి పాడి రైతుల కోసం సైలేజ్ యూనిట్ కోసం అర్హులైన పాడి రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి అజ్మీరా భాస్కర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాడి రైతులు ఫిబ్రవరి 2 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మిగితా వివరాల కోసం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఘనంగా పెద్దదేవునికి పూజ

నవతెలంగాణ - జైనూర్

సిర్పూర్(యు) మండలంలోని కాటిగూడ గ్రామంలో గల సెడ్మకి వంశీయుల పెద్దదేవుని(పెర్సాపేన్) ఉత్సవాలు రెండు రోజులుగా ఘనంగా కొనసాగుతున్నాయి. మంగళవారం అటవీ ప్రాంతంలో గల నదిలో పెద్దదేవునికి గంగాజలాభిషేకం చేశారు. అదేవిధంగా పెర్సాపేన్‌ను సెడ్మకి వంశీయులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మండల కేంద్రంలోని ఖాటిగూడలో గల పెద్దదేవునికి సెడ్మకి వంశీయులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సెడ్మకి గణపతిరావు, సుపుత్‌రావు, బాపురావు, భుజంగ్‌రావు, లక్ష్మణ్ పాల్గొన్నారు.